ఈనాడు హైదరాబాద్

HMDA

ఆదివారం 27 ఆగస్టు 2017 | 32 పేజీలు

రూపాయికే శుద్ధజలం

● కేంద్రాలను ప్రారంభించిన మేయర్



ఎన్టీఆర్ గార్డెన్స్ దగ్గర నీటిని పట్టుకుంటున్న యువతులు

ఈనాడు, హైదరాబాద్ - బంజారాహిల్స్, న్యూస్ టుడే: నగరవాసులకు నాణ్యమైన, శుద్ధ జలాన్ని అందించేందుకు జీహెచ్ఎంసీ నడుంబిగించింది. ఆధునిక సాంకేతికతతో పనిచేసే నీటిశుద్ధి విక్రయ కేంద్రాలను నగర మేయర్ బొంతు రామ్మోహన్ శనివారం నెక్లెస్‌రోడ్డులోని ఎన్టీఆర్ గార్డెన్ దగ్గర ప్రారంభించారు. నీటిలోని ఖనిజాలను అలాగే ఉంచి, క్రిములను తొలగించే ఈ యంత్రాలు ఆరోగ్య హైదరాబాద్ నిర్మాణానికి దోహదపడతాయని ఆయన అన్నారు. ఏడాదిలో 250 'ఎనీ టైం వాటర్(ఏటీడబ్ల్యూ)' కేంద్రాలను గ్రేటర్‌లో ఏర్పాటు చేస్తామని మేయర్ స్పష్టం చేశారు. వినియోగదారులు కియోస్క్(కేంద్రం)లో రూపాయి నాణెం వేసి లీటరు నీటిని పట్టుకోవచ్చు.

హైటెక్ నగరమని చెప్పుకొంటున్నప్పటికీ.. ప్రధాన బస్‌స్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రహదారి కూడళ్లలో ఇంకా మంచినీటికి ...మిగతా 4లో



హిమాయత్‌నగర్ ప్రధాన రహదారిపై వరద నీటి అలలపై వాహనదారుల ఇబ్బందులు



దీప్తిశ్రీనగర్‌లో వర్షానికి జలమయమైన నివాసాలు

ఇంతే... భరించాల్సిందే!

● చినుకు పడితే నగరం చిగురుటాకు
● చిన్న వాననూ తట్టుకోలేని పరిస్థితి
● బస్తీలు, దారులు... గోదారులైన వైనం
● ఏళ్లు గడుస్తున్నా ఆక్రమణలోనే నాలాలు

ఈనాడు, హైదరాబాద్

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అంటే ఇదేనేమో! శుక్రవారం రాత్రి ఎనిమిది నుంచి నాలుగు గంటల పాటు భారీ వర్షం కురిస్తే హైదరాబాద్‌లోని దాదాపు వంద కాలనీల ప్రజలు గండం గట్టెక్కేదెలా అనుకుంటూ జాగారం చేయాల్సి వచ్చింది. నాలుగైదు సెంటీమీటర్ల వర్షం కురిసిన ప్రతిసారీ రాజధానిలో వేలాది మంది నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తోంది.

శుక్రవారం రాత్రి 12.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. కుండపోత వల్ల పొంగిన నాలాలు, డ్రెయిన్లతో అనేక కాలనీల్లోకి నీరు చొచ్చుకు వచ్చింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ పరిస్థితి ప్రతి వర్షాకాలంలో ఎదుర్కోవాల్సిందేనా?... సాధారణ ప్రజల ప్రశ్నకు అధికారుల దగ్గర సమాధానం లేదు.

నగరానికి వందేళ్ల కిందటే అద్భుతమైన నాలాల వ్యవస్థ ఉంది. ఎక్కడ వర్షంపడినా కిందికి నీరు సాఫీగా వెళ్లేలా దాన్ని తీర్చిదిద్దారు. అటువంటి వ్యవస్థను చెరబట్టడం వల్లే చిన్నపాటి వర్షానికే నగరం చిగురుటాకులా వణుకుతోంది. ఒకప్పుడు 50 నుంచి ...మిగతా 4లో

మళ్లీ భారీ వర్షం!

రాబోయే 48 గంటల్లో నగరంలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఒడిశా ఉత్తర పశ్చిమ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో పాటూ రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు ప్రాంతాల్లో 3 నుంచి 5 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ బి.జనార్దన్ రెడ్డి బేగంపేటలోని భారత వాతావరణ శాఖ కార్యాలయాన్ని శనివారం ఉదయం సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. రుతుపవనాల ప్రభావంపై వాతావరణ శాఖ అధికారులతో చర్చించారు.

గ్రేటర్ పరిధిలో ప్రధాన నాలాలు, డ్రెయిన్లు...	74
నాలాల పొడవు...	390 కి.మీ.
ఇటీవలి సర్వే ప్రకారం నాలాపై అడ్డుగా ఉన్న నిర్మాణాలు...	12,500



మహా గణపతిం... మనసా స్మరామి!

భక్త జనానికి దీవెనలందించగా... ఖైరతాబాద్ మహా గణపతి సర్వాంగ సుందరంగా ముస్తాబై కొలువుదీరాడు. ఆ దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు నగరవాసులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు. శుక్రవారం ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ దంపతులు, ఇతర ప్రముఖులు తొలిపూజలు నిర్వహించారు.

వర్ష బీభత్సంపై ప్రత్యేక కథనాలు, చిత్రాలు... 6, 7, 10, 11 పేజీల్లో

అరబ్ షేక్ అడ్డం తిరిగాడు

- సంప్రదాయబద్ధంగా పెళ్లి చేశారంటూ పోలీసులకు వీడియో
- రూ.5 లక్షలు చెల్లిస్తానంటేనే బాలికను పంపుతానంటూ షరతులు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, చాంద్రాయణగుట్ట



బాలికతో అరబ్ షేక్

బాలికను ఒమన్‌కు చెందిన వృద్ధ షేక్ వివాహం చేసుకున్న వివాదం సరికొత్త మలుపు తిరిగింది. మూడు నెలల క్రితం పెద్దల బలవంతంతో పెళ్లి చేసుకొని ఒమన్‌లో చిత్రహింసలు అనుభవిస్తున్న పదహారేళ్ల రౌక్సర్ ఇంకా వృద్ధషేక్ చెరలోనే ఉంది. ఆమె ఫోన్‌లో వినిపించిన సంభాషణలు, ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఫలక్‌నుమా పోలీసులు అహ్మద్‌పై ఇటీవల కేసు నమోదు చేశారు. రౌక్సర్‌ను పంపిచాలంటే తాను బ్రోకర్లకు ఇచ్చిన రూ.5 లక్షల నగదుతోపాటు ఖర్చులు తన ఖాతాలో వేయాలంటూ అహ్మద్ షరతులు విధిస్తున్నాడు. పైగా తాను ఇస్లాం మత పద్ధతుల్లోనే బాలికను వివాహం చేసుకున్నానని పోలీసులనే దబాయిస్తున్నాడు. ఈ మేరకు పోలీసులకు ఒక వీడియోను పంపించాడు. పోలీసులు మాత్రం రౌక్సర్‌ను సురక్షితంగా పంపకపోతే తామే అక్కడికి వస్తామంటూ అతడిని హెచ్చరించారు. రెండు రోజులు వేచి చూశాక అహ్మద్ నుంచి స్పందన రాని పక్షంలో ఒమన్‌కు ప్రత్యేక బృందాన్ని పంపుతామని దక్షిణ మండలం డీసీపీ వి.సత్యనారాయణ తెలిపారు.

సక్రమంగానే పెళ్లి చేసుకున్నా.. పదహారేళ్ల రౌక్సర్‌ను ఆమె తండ్రి అఫ్సర్ అంగీకారంతో తాను సక్రమ పద్ధతుల్లోనే పెళ్లి చేసుకున్నానంటూ ఒమన్ షేక్ వీడియో సాక్ష్యాలను పంపించాడు. ఆ వీడియోలో బ్రోకర్లు గౌసియా బేగం, సికిందర్ చెప్పిన మాటలు, ఎలాగైనా రౌక్సర్‌తో వివాహం జరిపిస్తాం. మాకు రూ.5 లక్షలు ఇవ్వండి.. కట్నంగా ఒక స్కూటీ, ఇతర వస్తువులు మాత్రం అఫ్సర్‌కు ఇస్తేచాలు అన్నమాటలు, మంతనాలూ అందులో ఉన్నాయి. రౌక్సర్‌ను పెళ్లి చేసుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులొస్తాయన్న భావనతో రౌక్సర్ వయస్సును 21 సంవత్సరాలుగా రాయించి తీసుకురావాలంటూ గౌసియాబేగంకు వివాహం జరిపించే ఖాజీ సూచించాడు. ఖాజీ సూచనను గౌసియాబేగం రౌక్సర్ తండ్రి అఫ్సర్‌కు తెలపగా.. రౌక్సర్ వయస్సు 21 సంవత్సరాలంటూ ధ్రువీకరణ పత్రం తెచ్చాడు. ఈ పత్రాన్ని ఒమన్ షేక్‌కు చూపించగా.. వారికి రూ.5లక్షలు ఇచ్చిన అనంతరం ఖాజీ ఇద్దరికీ పెళ్లి చేశాడు. నాలుగురోజులు హైదరాబాద్‌లో ఉన్న అనంతరం అహ్మద్ రౌక్సర్‌కు పాస్‌పోర్టు తీయించి పెళ్లిఫోటోలను తన పాస్‌పోర్టుకు జతచేసి ఆమెను తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడికి వెళ్లిన రౌక్సర్ అతడికి ముందే పెళ్లయ్యిందంటూ తెలుసుకుంది. తల్లిదండ్రులతో మాట్లాడతానంటూ అప్పుడప్పుడు అతడి ఎదురుగానే మాట్లాడేది. ఎవరూ లేని సమయంలో ఫోన్‌చేసి తనను చిత్రహింసలు పెడుతున్నారంటూ రోదిస్తూ తల్లిదండ్రులకు వివరించింది.

బాల్యవివాహం నేరం.. అరెస్ట్ చేస్తాం

ఒమన్ షేక్ అహ్మద్‌ను అరెస్ట్ చేసేందుకు ఫలక్‌నుమా పోలీసులు సాక్ష్యాలను సిద్ధం చేసుకున్నారు. రౌక్సర్ తండ్రి అఫ్సర్ వాంగ్మూలం సేకరించారు. భారత చట్టాల ప్రకారం బాల్యవివాహం నేరమని, మైనర్‌ను మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటే భారత శిక్షాస్మృతి ప్రకారం శిక్ష అనుభవించాలంటూ అహ్మద్‌కు ఫోన్ చేసి చెప్పారు. విదేశీయులు ఇక్కడికి వచ్చి పెళ్లి చేసుకున్నప్పుడు తల్లిదండ్రులు అంగీకరించినా సరే అమ్మాయి యుక్త వయస్సు కాకపోతే పెళ్లి కూడా చెల్లదంటూ పేర్కొంటూ ఇందుకు సంబంధించిన పాతకేసుల వివరాలు, న్యాయస్థానాలు వెల్లడించిన తీర్పులను ఇందుకు సాక్ష్యాధారాలుగా తయారు చేసుకున్నారు. ఒమన్‌కు నుంచి బాలికను తీసుకొచ్చాక మెజిస్ట్రేట్ సమక్షంలో రౌక్సర్ వాంగ్మూలాన్ని సేకరించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అతడికి పోలీసులు ఇప్పటికే వివరించారు. దీంతోపాటు అతడిపై కేసు నమోదు చేసిన అనంతరం న్యాయస్థాయంలో బలమైన సాక్ష్యాధారాలుండేలా ఆమె తల్లిదండ్రులతో పాటు బ్రోకర్లను అప్రూవర్‌లుగా మార్చారు. దీంతోపాటు ఒమన్ షేక్ బసచేసిన లాడ్జి, అతడు పెళ్లి సమయంలో అతడి తరఫున ఉన్న సాక్షులు ఎవరు అన్న అంశాలను ఫోటోలు, వీడియోలో తీశారు. బాల్యవివాహం చేసుకోవడంతో పాటు పోలీసులకే పాఠాలు చెబుతున్నారంటూ పోలీస్ అధికారులు ఒమన్‌షేక్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి చేసిన బ్రోకర్లను తమదైన శైలిలో 'కౌన్సిలింగ్' ఇచ్చారు.

చోరీ చేస్తాడు.. ముంబయికి వెళ్తాడు

దొంగసొత్తుతో వ్యభిచార గృహాల్లో జల్సాలు ● 6 నెలల్లో 11 చోరీలు.. పట్టుబడిన నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ గంగారెడ్డి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: చోరీలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్న ఓ దొంగతో పాటు, ఓ కేసులో అతనికి సహకరించిన వ్యక్తిని రాజేంద్రనగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ ఏసీపీ గంగారెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. చింతల్‌మెట్‌కు చెందిన మహ్మద్‌గౌస్ పాషా(22) కూలీపని చేస్తుంటాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన అతను సంపాదన చాలకపోవడంతో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. 2011లో రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. పోలీసులు అరెస్టు చేసి అప్పుడు మహ్మద్‌గౌస్ మైనర్‌కావడంతో జువైనల్ హోంకు తరలించారు. 2013లో లంగర్‌హౌస్ ఠాణా పరిధిలో రూ.4.50లక్షలు దొంగతనం చేశాడు. పోలీసులు మరోసారి అరెస్టు చేసి మళ్లీ జువైనల్ హోంకు తరలించారు. అయితే బెయిల్‌పై వచ్చిన మహ్మద్‌గౌస్ ప్రవర్తనను మార్చుకోవడం లేదు. దీంతో స్థానికంగా ఉండే మతపెద్దలు ఇతన్ని మార్చాలనే ఉద్దేశంతో మరోసారి దొంగతనాలకు పాల్పడకుండా ఉండేందుకు 'జమాత్'(చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా బోధించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు)కు పంపించాలని నిర్ణయించారు. దీంతో మహ్మద్‌గౌస్‌ను ముంబయికి పంపించారు. అక్కడకు వెళ్లినా ప్రవర్తనను మార్చుకోకుండా అక్కడి వ్యభిచార గృహాల్లోని మహిళలతో పరిచయం పెంచుకున్నాడు. దీంతో అప్పుడప్పుడు నగరానికి రావడం తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడటం వెంటనే ముంబయికి వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నాడు. గత ఆరు నెలల్లో రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో 11 చోరీలకు పాల్పడ్డాడు. సుమారు రూ.15లక్షల వరకు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఇతని నుంచి 5తులాల బంగారం, 40తులాల వెండి, 3టీవీలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఇంటి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఓ ద్విచక్ర వాహనం దొంగతనంలో గౌస్‌తోపాటు రంగారెడ్డి జిల్లా నందిగామకు చెందిన కృష్ణ పాలు పంచుకున్నాడు. దీంతో అతన్ని కూడా పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డీఐ వి.నాగయ్య, డీఎస్సై శేఖర్‌రెడ్డిలను ఏసీపీ అభినందించారు.

ఆటోలో వెళ్తుండగా గొలుసు చోరీ యత్నం

చైతన్యపురి: భార్యభర్త కలిసి ఆటోలో ప్రయాణిస్తుండగా ఎదురుగా (రాంగ్ రూట్లో) ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కోవడానికి యత్నించారు. మహిళ గొలుసు పట్టుకోవడంతో రూ.30 వేలు విలువ చేసే తాళి బొట్టు దుండగులు కాజేయగా మిగిలిన గొలుసు మాత్రం దక్కింది. చైతన్యపురి పోలీసుల కథనం ప్రకారం మోహన్‌నగర్‌కు చెందిన లక్ష్మి, ఆమె భర్త లక్ష్మీనారాయణ తమ ఇంటి నుంచి ఆటోలో ఓల్డ్ సిటీకి బంధువుల వద్దకు వెళ్తున్నారు. మార్గమధ్యలో చైతన్యపురి ఠాణాకు కూతవేటు దూరంలో (ఓమ్నీ ఆసుపత్రి సమీపంలో) ఆటోకు ఎదురుగా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగుల్లో ఒకరు బైక్ నడపుతుండగా వెనక కూర్చున్న మరో వ్యక్తి ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసు లాక్కోవడానికి యత్నించాడు. వెంటనే తేరుకున్న ఆమె తన మెడలోని గొలుసును ఒడిసి పట్టుకోగా గొలుసు కింద భాగంలో ఉండే ఒక తులం తాళిబొట్టు మాత్రం దుండగుల చేతిలో పడింది దాంతో వారు ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా.. పండగరోజు ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు లాక్కుని పరారైన సంఘటన చైతన్యపురి ఠాణా పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నాగోలు శృంగేరీ కాలనీకి చెందిన పావని స్రవంతి(25) వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని ఉదయం ఇంటి ముందు ముగ్గులు వేస్తోంది. ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు

అన్నయ్యా.. చదవలేకపోతున్నా!

లేఖ రాసి విద్యార్థిని ఆత్మహత్య



అరుణ మృతదేహం

మాదాపూర్ న్యూస్‌టుడే: "అన్నయ్యా నేను చదవలేకపోతున్నా ...ఏది చదివినా రెండు మూడు రోజుల కంటే ఎక్కువగా గుర్తుండడం లేదు" అని లేఖ రాసి కళాశాల వసతిగృహంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని విషాదాంతమిది. మాదాపూర్ ఠాణా ఎస్.ఐ. వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లా దారూర్ మండలం రేవులపల్లి గ్రామానికి చెందిన రాజన్న కుమార్తె వై.అరుణ(18) గత ఏడాది ఇంటర్ పూర్తి చేసింది. మాదాపూర్ అయ్యప్పసొసైటీలోని నారాయణ కళాశాల వర్మ వన్ క్యాంపస్‌లో 'నీట్' పరీక్షల కోసం శిక్షణ తీసుకుంటోంది. శనివారం సాయంత్రం కళాశాలలో తరగతులు ముగిశాయి. తోటి విద్యార్థులు భోజనశాలలో అల్పాహారం తీసుకుంటుండగా అరుణ మాత్రం వసతిగృహంలోని తన గదికి వచ్చింది. కొద్ది సమయం తరువాత స్నేహితులు వెళ్లి చూడగా అప్పటికే చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. కళాశాల సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అరుణ తన సోదరుడికి రాసిన లేఖ గదిలో లభించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె సోదరుడు ప్రస్తుతం ఉస్మానియా వైద్యకళాశాలలో చదువుతున్నాడు. అతని మాదిరిగానే వైద్య కోర్సు చదవాలని కలలు కన్న ఆమె అంతలోనే తనువు చాలించింది. అరుణ తల్లిదండ్రులు రావాల్సి ఉందని, వారు వచ్చిన తరువాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.



నిర్లక్ష్యానికి పరాకాష్ఠ సోమాజిగూడలోని బాబూఖాన్ మిలీనియం సెంటర్ సమీపంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఇది. దీనిచుట్టూ తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారినా విద్యుత్తు సిబ్బంది దృష్టికి రాకపోవడం విశేషం.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వినోద్ (పాత చిత్రం)


ఉప్పల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఉప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన బండారి వినోద్‌కుమార్(27) ఉప్పల్‌లోని సర్వే కాలనీలో నివాసముంటూ కారు డ్రైవర్‌గా చేస్తున్నాడు. ఈ నెల 24న రాత్రి ఆయన స్నేహితుడు క్రాంతికుమార్‌తో కలిసి ఉప్పల్‌లోని సరస్వతి కాలనీలో గణేశ్ ప్రతిమను కొనుగోలు చేసుందుకు వెళ్లారు. విగ్రహం కొనే ప్రాంతంలో విద్యుత్తు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై వినోద్‌కుమార్ కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమవడంతో వెంటనే చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వినోద్‌కుమార్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

చేతులు తడపందే చేయి పట్టరు!

☛ లేదంటే గంటల తరబడి నిరీక్షణ

☛ వ్యాధి నిర్ధరణ పరీక్షల్లో తీవ్ర జాప్యం

☛ నిమ్స్ ఆసుపత్రి సిబ్బంది చేతి వాటం



ఈనాడు, హైదరాబాద్

ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న మోహన్‌కు కొన్నాళ్లుగా వెన్నునొప్పి వస్తోంది. ఔషధాలు వాడితే తగ్గలేదు. నిమ్స్‌కు వెళ్లగా సీటి స్కాన్ చేయాలని సూచించారు. స్కానింగ్ కోసం ఓపీ కార్డు తీసుకొని ఉదయం 8 గంటలకు వెళ్లిన మోహన్‌కు మధ్యాహ్నం 1 గంట వరకు చూసినా పిలుపు రాలేదు. అతని కంటే వెనుకున్న వారంతా పరీక్షలు చేయించుకొని వెళ్తున్నారు. అనుమానం వచ్చి ఆరా తీయగా అక్కడ సిబ్బంది చేయి తడపందే పని కాదని తెలిసింది. మోహన్ సిబ్బందిని గట్టిగా నిలదీయగా అప్పటికప్పుడు స్కానింగ్ తీసి బయటకు పంపించి వేశారు.

ఒక్క మోహన్ విషయంలోనే కాదు. నిత్యం వందల సంఖ్యలో రోగులకు నిమ్స్ సిబ్బంది ఇలా చుక్కలు చూపిస్తున్నారు. ప్రతి సేవకు రోగుల నుంచి డబ్బులు వసూలు చేసే సిబ్బంది తీరుతో రోగులు విసిగిపోతున్నారు. డబ్బులు ఇస్తే చాలు...ఎంత ఆలస్యంగా వచ్చినా ముందే పరీక్షలు అయిపోతాయని రోగులు ఆవేదన చెందుతున్నారు. పరీక్షలకు రూ.వేలకు వేలు చెల్లించి మళ్లీ సిబ్బందికి ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఆర్ఎంవోలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కొందరు సిబ్బంది ఆడిందే ఆటగా పాడిందే పాటగా సాగుతోందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా సేవలు అందిస్తున్న నిమ్స్‌లో అవినీతి జాడ్యం చివరికి ఆసుపత్రి ప్రతిష్ఠను బజారున పడేలా చేస్తోందని ఆరోపిస్తున్నారు.

నిమ్స్‌కు నిత్యం 1200-1500 మంది అవుట్ పేషెంట్లు విచ్చేస్తుంటారు. మరో 200 మంది ఆసుపత్రిలో చేరుతుంటారు. 27 వరకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతున్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ, యురాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రోఎంటరాలజీ తదితర కీలక విభాగాలకు రోగుల తాకిడి ఎక్కువ. బయట ప్రైవేటు ఆసుపత్రులతో పోల్చుకుంటే దాదాపు 30 శాతం తక్కువకే సేవలు అందుతుంటాయి. ఉదాహరణకు ఇతర ఆసుపత్రిలో ఓపీ సేవలు పొందాలంటే రూ.500 నుంచి రూ.800 కన్సల్టేషన్ రుసుం చెల్లించాలి. నిమ్స్‌లో అది రూ.100 మాత్రమే. పైగా వారం రోజుల వరకు మళ్లీ కన్సల్టేషన్ రుసుం ఉండదు. ఇక వ్యాధి నిర్ధరణ పరీక్షలకూ ధర తక్కువ. బయట ల్యాబ్‌ల్లో ఎమ్మారై రూ.6నుంచి 7 వేలు ఉంటే నిమ్స్‌లో రూ.4వేల లోపే ఖర్చవుతుంది. ఆరోగ్యశ్రీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీం, పింఛనుదారులు నిమ్స్‌లో చికిత్స తీసుకునేందుకు ఆసక్తి చూపుతుంటారు. నిత్యం 200-300 రకాల వివిధ వ్యాధి నిర్ధరణ పరీక్షలు చేస్తుంటారు. ముఖ్యంగా సీటి, ఎమ్మారై, అల్ట్రాసౌండ్ తదితర పరీక్షల వద్ద అధిక రద్దీ ఉంటోంది. దీనిని కొందరు సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారు. డబ్బులు చెల్లించిన రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. డబ్బు ఇవ్వకపోతే సేవలు ఆలస్యంగా పొందాల్సి వస్తోంది.

ఆ పరీక్షలంటే నిరీక్షణే...

రద్దీ వల్ల సీటి, ఎమ్మారై పరీక్షలంటే రోగులకు దడ పుడుతోంది. ఈ పరీక్షలకు కనీసం వారం రోజుల పాటు నిరీక్షించాల్సిందే. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, ఇతర రోగులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. నిరీక్షించలేక కొందరు బయటి ల్యాబ్‌లో అధిక డబ్బులు చెల్లించి పరీక్షలు చేయించుకుంటున్నారు. ఒక క్రమ పద్ధతి అంటూ లేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోంది. చాలా రోగాల నిర్ధరణకు సీటి, ఎమ్మారై, అల్ట్రాసౌండ్ తదితర పరీక్షలు కీలకం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పకడ్బందీగా ఈ సేవలను అందేటట్లు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

హోమియో వైద్యంపై అవగాహన పెరగాలి



నివాళులర్పిస్తున్న వేణుగోపాలచారి, రామేశ్వరరావు, పావులూరి కృష్ణచౌదరి తదితరులు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: హోమియోపతి వైద్య విధానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, భవిష్యత్తు హోమియోపతిదే అని దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డా.వేణుగోపాలచారి అన్నారు. శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ హోమియోపతిక్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఏదైనా ఒక చోట హోమియోపతి వైద్య కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య కళాశాలలు పెరగాల్సి ఉందన్నారు. ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు డా.పావులూరి కృష్ణచౌదరి మాట్లాడుతూ.. హోమియోపతిలో ఇతర ప్రభావాలేవీ ఉత్పన్నం కావని ఈ వైద్యానికి ఎలాంటి భయం అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కాళోజీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా.కరుణాకర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌రావు, డా.ఉమారాణి, డా.గాయత్రి ప్రసాద్, డా.శివశంకర్, ఆయుష్ డైరెక్టర్ డా.రాజేందర్‌రెడ్డి, ఆయుష్ విభాగం అసిస్టెంట్ అడ్వైజర్ డా.చింతా శ్రీనివాసరావు, హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ గౌరవ సలహాదారు శివశంకర్ పాల్గొన్నారు.

'ధూల్‌పేట' వాసులకు ఉపాధిపై కలెక్టర్ సమీక్ష

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ధూల్‌పేట గుడుంబా వాసులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు సంబంధించి పరిపాలన మంజూరీ ఇచ్చిన యూనిట్లన్నింటిని ఈ నెల 31వ తేదీలోపు ఆచరణలోకి తేవాలని హైదరాబాదు జిల్లా కలెక్టర్ యోగితారాణా ఆబ్కారీ శాఖ అధికారులను ఆదేశించారు. ధూల్‌పేట ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన పథకాల పురోగతిపై శనివారం ఎక్సైజ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులతో కలిసి తన ఛాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1,271 కేసులలో నమోదు చేయని, బైండోవర్ కాని కారణంగా అనర్హులుగా గుర్తించిన కేసుల వివరాలను విభాగాల వారీగా తయారుచేసి సమర్పించాలని ఆదేశించారు. వచ్చే నెల 10లోపు ఉపాధి కల్పన కార్యక్రమాలు పూర్తవుతాయన్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వివేకానంద్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంటెంట్లు పాల్గొన్నారు.

29న జాతీయ క్రీడా దినోత్సవాలు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: జిల్లా యువజన, క్రీడా శాఖ హైదరాబాదు జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ హాకీ క్రీడాకారులు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాల సందర్భంగా ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా జిల్లా యువజన, క్రీడా అధికారి ఎన్.సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాదు జింఖానాలోని జిల్లా యువజ, క్రీడా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా కబడ్డీ, హాకీ, వాలీబాల్ అండర్-17 పాఠశాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 28వ తేది ఉదయం 11 గంటలలోపు నమోదు చేసుకోవాలని కోరారు.





విజేతలైన డీఏవీ పాఠశాల విద్యార్థులు (సీనియర్స్), జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల(జూనియర్స్)లతో అతిథులు, నిర్వాహకులు

ఉట్టిపడిన సంప్రదాయ, జానపద కళా వైభవం

విజేతలుగా డీఏవీ, జూబ్లీహిల్స్ పాఠశాలలు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: అటు జానపద, గ్రామీణ నృత్య రీతుల ప్రదర్శన, ఇటు శాస్త్రీయ కూచిపూడి నాట్యం వెరసి భారతీయ సంప్రదాయ జానపద నృత్య ప్రదర్శనలు సందర్శకులను ముగ్ధులను చేశాయి. స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ డి.మల్లేష్ గుప్తా స్మారక అంతర్ పాఠశాలల భారతీయ జానపద నృత్య పోటీల కార్యక్రమం 'కళా ఉత్సవ్-2017' కనుల పండువగా సాగింది. సనత్‌నగర్‌లోని హిందూ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)లో శనివారం జరిగిన పోటీల్లో నగరంలోని 14 సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన 28 జట్ల నుంచి 340 మంది విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రదర్శనను కనబరిచారు. తెలంగాణ సంప్రదాయ నృత్యాలు, దేశభక్తి భావం పెల్లుబుకేలా నృత్య రూపకాలు, పర్యావరణ పరిరక్షణ కోసం స్ఫూర్తినిచ్చేలా విద్యార్థుల ప్రదర్శనలతో సభా ప్రాంగణం మార్మోగింది. అద్భుత ప్రతిభ కనబరచి ఆకట్టుకున్న డీఏవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సీనియర్స్ విభాగంలో విజేతలుగా నిలిచారు. జూనియర్స్ విభాగంలో కూడా డీఏవీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రెండో బహుమతి గెలుచుకోవడం విశేషం. ఇక సీనియర్స్ విభాగంలో ఎంఎన్ఆర్ పబ్లిక్ స్కూల్ రెండో బహుమతి సాధించగా, జూనియర్స్ విభాగంలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్త, జయరాజ్ స్టీల్స్ ఇస్పాట్ లిమిటెడ్ ఎండీ సజ్జన్‌కుమార్ గోయంకా మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందుతున్న భారతీయ సాంస్కృతిక, సంప్రదాయ సంపదను భావితరం విద్యార్థులు పరిరక్షించుకోవాలని అన్నారు. స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షులు, భాజపా క్రమశిక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర్గుల శ్యామ్‌సుందర్, ప్రతినిధులు కంజర్ల చంద్రకళాయాదవ్, డాక్టర్ హెచ్.ఎన్.త్రిపాఠి, డి.చంద్రశేఖరగుప్తా, సూర్యనారాయణరావు, హెచ్‌పీఎస్ ప్రిన్సిపల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగుత్తేదారు సంస్థ గోదాంలో అగ్నిప్రమాదం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఎంఎంటీఎస్ రెండో దశ పనులను చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థల్లో ఒకదానికి సంబంధించిన గోదాంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రూ.2కోట్లమేర ఆస్తి నష్టం వాటిల్లిందని సంస్థ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఏడో నెంబరు జాతీయ రహదారిలోని డైరీ ఫారం కూడలి సమీపంలో సంస్థ నిర్మాణ సామగ్రిని భద్రపరచడానికిగాను గోదాంను ఏర్పాటు చేసింది. శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో రెండు గదుల్లోంచి మంటలు వ్యాపిస్తుండడాన్ని కాపలాదారులు గుర్తించారు. సమాచారం మేరకు చేరుకున్న ప్యారడైజ్ అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను అదుపు చేశారు. పీవీసీ వైర్ కాయిల్స్, మీటర్లు, పరికరాలు దగ్ధమయ్యాయని సంస్థ మేనేజర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ రెండో దశ పనులను 2019 సంవత్సరాంతానికి పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నప్పటికీ దీంతో పనుల్లో జాప్యం జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. శనివారం రాత్రి బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.



గోదాంలో కాలిపోయి ఉన్న సామగ్రి

పక్కనే ఉంటారు... పని పడతారు!



- ఆకతాయిలూ పారాహుషార్
- మండపాల పరిసరాల్లో 'షి' బృందాలు
- సాధారణ దుస్తుల్లో విధుల నిర్వహణ

ఈనాడు, హైదరాబాద్

రాజధానిలో గణేష్ ఉత్సవాలు భక్తులు... యువజన కేరింతల మధ్య జోరుగా మొదలయ్యాయి... కన్నుల పండువగా కొనసాగుతున్నాయి... ప్రజలు.. సందర్శకులు.. వీఐపీల సందర్శనలు... మండపాల పరిసరాల్లో భజనలు... సాంస్కృతిక కార్యక్రమాలు ఊపందుకున్నాయి... నగరంలో వందల సంఖ్యలో వెలసిన గణేష్ మండపాల భద్రతకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. దాదాపు అన్ని గణేష్ మండపాల దగ్గర సీసీ కెమెరాల నిఘా ఉండేలా పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేపట్టారు... పోలీస్ బందోబస్తుతోపాటు యువతులు.. మహిళలకు రక్షణగా వంద 'షి' బృందాలు విధులు నిర్వహిస్తున్నాయి. స్థానిక పోలీసులు 'షి' బృందం సభ్యులకు సహకరిస్తున్నారు. పదకొండురోజుల పాటు పనిచేసిన అనంతరం వీరు ఘాట్లలో నిమజ్జనం పూర్తయ్యేంత వరకూ యువతులు... మహిళలకు రక్షణగా ఉండనున్నారు. మండపాల దగ్గర గణేష్‌ను దర్శించుకుని పూజలు చేసేందుకు వస్తున్న వారిని కొందరు పోకిరీలు ఉద్దేశపూర్వకంగా అల్లరి చేసేందుకు, వేధించేందుకు ప్రయత్నాలు చేస్తారన్న అంచనాతో 'షి' బృంద సభ్యులు మండప పరిసర ప్రాంతాల్లో మఫ్టీలో ఉంటున్నారు. వీరిని అక్కడికక్కడే పట్టుకునేందుకు సూక్ష్మ కెమెరాలను వినియోగిస్తున్నారు.



గణేశ్ మండపం సమీపంలో షీ బృందం ప్రచారం

ఖైరతాబాద్ గణేశుని చుట్టూ...

నగరంలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఖైరతాబాద్ గణనాథుడి పరిసర ప్రాంతాల్లో మూడు 'షి' బృందాలు పని చేస్తున్నాయి. యువతులు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా దూరం నుంచే పరిశీలిస్తూ అక్కడున్న పోలీసులకు, వలంటీర్లకు సూచనలిస్తున్నారు. ఒక మహిళా కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఖైరతాబాద్ రైల్వేగేట్ నుంచి గణేష్ విగ్రహం వరకూ, గణేష్ విగ్రహం నుంచి జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం వరకూ సాధారణ ప్రజలు గుర్తించకుండా ఎవరికీ అనుమానం రాకుండా ఈవ్‌టీజర్లు, పోకిరీలను గుర్తిస్తున్నారు. తొలిరోజైన శుక్రవారమే భక్తజనం పోటెత్తడంతో మూడు బృందాలు అప్రమత్తంగా ఉన్నాయి. శనివారం ఉదయం నుంచే యువతులు, మహిళలు వందల సంఖ్యలో వస్తుండటంతో వారి చుట్టూ కనిపించని రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. గణేష్ మండపం సమీపంలో ఇద్దరు 'షి' బృందం సభ్యులు మహిళలు, యువతులతో మాట్లాడుతూ ఎక్కడైనా ఇబ్బందులు ఎదురయ్యాయా? ఎవరైనా వేధించారా? ఉద్దేశపూర్వకంగా మీపై అనుచితంగా ప్రవర్తించారా? అంటూ ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలను సేకరిస్తున్నారు. కొంత ఇబ్బందికరంగా ఉందని ఎవరైనా చెబితే వెంటనే అక్కడున్న 'షి' బృందాలకు ఫోన్, వైర్‌లెస్‌సెట్ల ద్వారా సమాచారం పంపించి వారిని పట్టుకుంటున్నారు. సమాచారం ఇచ్చేవారితోనే కాకుండా రహస్య కెమెరాలతో పోకిరీల చేష్టలను చిత్రీకరించి అనంతరం వారిని కౌన్సెలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్నారు.



ఖైరతాబాద్ గణేశుని దగ్గర ప్రచారం చేస్తున్న షి బృందం సభ్యులు

వీడియో.. ఆడియో సీడీల పంపిణీ...

పోకిరీలు, ఈవ్‌టీజర్ల పని పట్టేందుకే మేం విధులు నిర్వహిస్తున్నామంటూ భక్తులు, యువతులకు 'షి' బృందం సభ్యులు వివరిస్తున్నారు. గణేష్ మండపాల దగ్గర ఈ పోలీస్ గోలేంటి అనుకుంటారన్న ఉద్దేశంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. నగరంలో ఎక్కడైనా సరే ఈవ్‌టీజింగ్ ఎదుర్కొన్నా, పోకిరీలు వేధించినా తమకు సమాచారం అందించాలంటూ సూచిస్తున్నారు. దీంతోపాటు పోకిరీలు, ఈవ్‌టీజర్ల ఆగడాలు ఇలా ఉంటాయంటూ టీనేజర్లకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యక్తిగతంగా ఇలాంటి ఇబ్బందులు ఇప్పటికే ఎదుర్కొనుంటే తమకు సమాచారం ఇస్తే ఈవ్‌టీజర్లను అరెస్ట్ చేస్తామంటూ అభయమిస్తున్నారు. మండపాల నిర్వాహకులకు వినాయక స్తోత్రాలతో కూడిన ఆడియో సీడీలను అందిస్తున్నారు. పాటలు, శ్లోకాల మధ్యలో 'షి' బృందం విధులు, మహిళలకు అండదండగా ఉన్న విధానాలను వివరించే పాటలను ఉంచారు. ఎల్సీడీ తెరలు ఏర్పాటు చేసిన మండపాల దగ్గర వీడియో సీడీలను పంపిణీ చేస్తున్నారు. భక్తుల సందర్శన ప్రత్యక్ష ప్రసారంతో పాటు మధ్యలో విరామం ఉన్నప్పుడు 'షి' బృందాల లఘుచిత్రాలను ప్రసారం చేస్తున్నారు. 'షి' బృందాలు తమదైన శైలిలో విధులు నిర్వహిస్తున్నాయని ఏసీపీ డి.కవిత తెలిపారు. రెండురోజుల పాటు పరిశీలించాక ఎక్కడెక్కడ భక్తుల రద్దీ ఎక్కువగా ఉందో గుర్తించామని అక్కడికి 'షి' బృందాలను పంపించి ఈవ్‌టీజింగ్, పోకిరీల బెడదలేకుండా చర్యలు చేపట్టనున్నామని వివరించారు.

ఇంతే... భరించాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి) 100 అడుగుల వెడల్పుతో ఉన్న నాలాలు నేడు 50 నుంచి 20 అడుగులకు కుంచించుకుపోయాయి. నాలాల పరివాహక ప్రాంతాల వెంబడి ఇష్టానుసారం అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కొన్ని ప్రాంతాల్లో నాలాలపైనా నిర్మాణాలొచ్చాయి. ఈ పరిస్థితుల కారణంగా నగరంలోని నాలాలు కేవలం 2 సెం.మీ. వర్షపాతాన్నే తట్టుకుంటాయని గతంలో అధికారుల బృందం తేల్చింది. నగరవ్యాప్తంగా సర్వే చేసి నాలాల దుర్గతిని ఇంజినీరింగ్ అధికారులు తేటతెల్లం చేశారు. సగటున ఏడాదికి నగరంలో 83 సెం.మీ. వర్షం కురుస్తుందని, దాన్ని తట్టుకునేలా నాలాలను విస్తరించకపోతే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం అవుతూనే ఉంటుందని హెచ్చరించారు.

చెరువులనూ అభివృద్ధి చేయాలి : శేరిలింగంపల్లి ప్రాంతంలోని 10 గొలుసుకట్టు చెరువులు, బాలానగర్ పరిధిలోని 15 చెరువులు, కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని మరో 6 చెరువుల నుంచి హుస్సేన్‌సాగర్‌కు వరద వస్తుంది. మార్గమధ్యంలో బల్కంపేట కాలువ, బేగంపేట, కుందన్‌బాగ్, పంజాగుట్ట, అమీర్‌పేట నాలాలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో బేగంపేట, కూకట్‌పల్లి నాలాలు ఉప్పొంగాయి. ఎగువనున్న చెరువులు అలుగు పారాయి. ఆయా చెరువుల్ని విస్తరిస్తే మరింత వరద అక్కడ నిల్వ ఉంటుందని, కబ్జాల చెర నుంచి విడిపిస్తే అది సాధ్యమవుతుందని అధికారులు అంటున్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు : గతేడాది వర్షాలకు కంగుతిన్న జీహెచ్ఎంసీ అధికారులు ఓ సర్వే నిర్వహించి 12,500 నిర్మాణాలు నాలాలకు అడ్డుగా ఉన్నాయని తేల్చారు. వాటిలో అత్యంత ప్రమాదకరంగా ఉన్న వెయ్యి నిర్మాణాలను మొదటి దశలో కూల్చేస్తామని రెండు నెలల కిందటే బల్దియా పట్టణ ప్రణాళిక విభాగం ప్రకటించింది. అందులో భాగంగా మూసాపేటలో పనులు ప్రారంభించామని చెప్పారు. ఇంత వరకు నాలాల విస్తరణ ముందుకు సాగలేదు. నేతల ఒత్తిళ్లు, ఆక్రమణదారుల గొంతెమ్మ కోర్కెలతో ప్రక్రియ అటకెక్కిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలాలపై నాలుగు సార్లు సర్వే జరిగిందని, ప్రతిసారీ కూల్చేస్తామని చెప్పడం.. తర్వాత నిశబ్దం వహించడం బల్దియాకు మామూలైందని అంటున్నారు.

ఓట్ల రాజకీయం : మొదటి దశలో 370 కిలోమీటర్ల మేర నాలాలను విస్తరించాలని అధికారులు తలపెట్టారు. దీనిపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని అధికారులు నిర్ణయిస్తే కొంతమంది ఎమ్మెల్యేలు రాజకీయ అవసరాలతో అడ్డుపడుతున్నారని అధికారులే చెబుతున్నారు. ఆక్రమణకు గురైన నాలాలను లోతు తీస్తే సరిపోతుంది కదా! ఆక్రమణలను తొలగించడం ఎందుకని ఓ ఎమ్మెల్యే అధికారులకు సలహా ఇచ్చినట్లు తెలిసింది.

తక్షణ చర్యలతోనే ఫలితం: ఒత్తిళ్లను అధిగమించి జీహెచ్ఎంసీ తక్షణం చర్యలు తీసుకోవాలి. మొత్తం నాలాల వ్యవస్థను ఇప్పటికిప్పుడు సంస్కరించలేం కాబట్టి ప్రస్తుతం అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తే కొంతవరకు ముంపు తగ్గించొచ్చు. ఈ దిశలో చర్యలు తీసుకోవాల్సింది. శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షాలు పడుతుంటే బల్దియా కమిషనర్ బి.జనార్దనరెడ్డి రహదారిపైకి మీదకు వచ్చి పరిశీలన చేసి తక్షణ చర్యలకు ఆదేశించారు. ఫలితంగా మొత్తం యంత్రాంగంలో కదలిక వచ్చింది.

తక్కువ ధరకే విమానం టిక్కెట్ల పేరిట మోసం

- దిల్లీ ముఠా గుట్టురట్టు
- ప్రధాన నిందితుడు పరారీ.. ముగ్గురి అరెస్టు



సూరజ్ నందన్



సౌరభ్



నిరంజన్

రాయదుర్గం, న్యూస్‌టుడే: దిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తు.. చౌక ధరలకే విమానం టిక్కెట్లు, యాత్ర ప్యాకేజీలంటూ మోసగిస్తున్న ముఠాకు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ముకుతాడు వేశారు. ముగ్గురు నిందితులను అరెస్టుచేశారు. డీసీపీ జానకి షర్మిల కథనం ప్రకారం.. దిల్లీకి చెందిన అమిత్ స్థానికంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి తక్కువ ధరలకే యాత్రల ప్యాకేజీలు కల్పిస్తున్నామని గూగుల్‌లో ప్రకటనలిస్తుంటాడు. ఇందుకు ఓ కాల్ సెంటర్‌ను ప్రారంభించాడు. సంప్రదించే యాత్రికులకు ఫోన్ చేసి మాయమాటలతో మొగ్గులోకి దింపి తన బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయించుకుంటాడు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్‌చేయడంతోపాటు కార్యాలయాన్ని మూసివేస్తుంటాడు. ఇటీవల కేబీహెచ్‌బీకి చెందిన కామేశ్వరరావు, మరో 9మంది కలిసి యాత్రల కోసం అతడిని సంప్రదించారు. రాహుల్ పాఠక్‌గా వారికి తనను పరిచయం చేసుకుని కోల్‌కతా, గువాహటి, వారణాసి తదితర ప్రాంతాల సందర్శనకు విమాన టిక్కెట్లు పంపిస్తున్నట్లు నమ్మించి తన ఖాతాల్లో దాదాపు రూ.1.28లక్షలు డబ్బులు జమ చేయించుకున్నాడు. కొన్నాళ్లకు ఓ విమానయానసంస్థ టిక్కెట్లు మెయిల్ చేశాడు. వాటి పీఎన్‌ఆర్‌లను పరిశీలించగా నకిలీవని తేలింది. మరోసారి అతడిని సంప్రదిస్తే అరుణ్‌పాల్ పేరున మళ్లీ నకిలీ టిక్కెట్లే పంపించి పత్తాలేకుండా పోయాడు. బాధితులు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగి ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ, ఖాతా నంబర్ల ఆధారంగా దిల్లీ పత్‌పర్ గంజ్‌కు చెందిన సూరజ్ నందన్ అగర్వాల్, సౌరభ్‌సింగ్, నిరంజన్‌కుమార్‌లను పట్టుకున్నారు. వారు నకిలీ గుర్తింపు పత్రాలు, చిరునామాలతో వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి మోసగాళ్లకు అందజేస్తున్నట్లు తేలింది. ఇందుకు రూ.9వేల నుంచి 20 వేల వరకూ కమిషన్ తీసుకుంటారు. అమిత్ కూడా వీరినుంచి ఖాతా నంబర్లు తీసుకుని తనను సంప్రదిస్తున్న యాత్రికులకు ఇస్తున్నాడు. ప్రస్తుతం అమిత్ పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేశారు.

నడిరోడ్డుపై ఓ జంట వీరంగం



వీరంగం సృష్టించిన జంట

నారాయణగూడ, న్యూస్‌టుడే: యువ జంట నడిరోడ్డుపై వీరంగం సృష్టించింది. 'యూ టర్న్' తీసుకొనే విషయంలో ఘర్షణ జరిగి కారు యజమానిపై, అక్కడికి వచ్చిన పోలీసులపై దాడికి దిగారు. వీరిపైన నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి, శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సైదులు కథనం ప్రకారం.. నారాయణగూడ హరివిహార్‌కాలనీకి చెందిన సురేందర్‌రెడ్డి తన కారులో వెళుతూ హిమాయత్‌నగర్ దగ్గర 'యూ టర్న్' తీసుకుంటుండగా పక్కనే బాగ్‌లింగంపల్లికి చెందిన బలరామ్, గోల్నాకకు చెందిన హరిత అగర్వాల్ ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి సురేందర్‌రెడ్డికి సమీపంగా దాటే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సురేందర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. కారును కొట్టారు. మాకు అడ్డుచెబుతావా అంటూ సురేందర్‌రెడ్డిని కారులోంచి బలవంతంగా బయటకులాగి కొట్టారు. ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న నారాయణగూడ ఎస్సై సైదులు సంఘటన స్థలికి వెళ్లి ఆ ఘటనను సెల్‌ఫోన్‌లో బంధిస్తుండగా యువతి ఎస్సై చేతిలో ఫోన్‌ను లాక్కొని కిందకొట్టారు. మరో ట్రాఫిక్ హోంగార్డు ఫోనునూ అలానే చేశారు. ఎస్సై సైదులును నెట్టివేశారు. పరిస్థితులు అదుపులోకి రాకపోవడంతో రక్షక్ వాహనాన్ని పిలిపించి ఇద్దరినీ ఠాణాకు తరలించారు. గాయపడ్డ సురేందర్‌రెడ్డి, ఆ జంట మానసిక పరిస్థితిని తెలుసుకోవడానికి ఆసుపత్రికి పంపించారు. బలరామ్, హరితఅగర్వాల్‌లపై ఐపీఎస్ 353, 341, 323, 504, ఆర్/డబ్ల్యూ34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రూపాయికే శుద్ధజలం

(మొదటిపేజీ తరువాయి) కటకటలాడాల్సిన పరిస్థితి ఉంది. గొంతు తడుపుకోవాలంటే కనీసం రూ.20 పెట్టి మినరల్ నీటి సీసా కొనుగోలు చేయాలి. లేదా దాహాన్ని అణుచుకోవాలి. ఖర్చును భరించలేని చాలామంది సర్దుకుపోవడం అలవాటు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ, జలమండలి సహకారంతో రూ.1కే నీరు అందిస్తామని జోసబ్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. జీహెచ్ఎంసీ స్థలం చూపిస్తే.. జలమండలి నీళ్లు సమకూర్చనుంది. సాధారణ ఆర్వో(రివర్స్ ఆస్మోసిస్) విధానంకన్నా.. ఏటీడబ్ల్యూ యంత్రాల సాంకేతికత చాలా ఉపయోగకరమైందని మేయర్ రామ్మోహన్ అన్నారు. ఆర్వో విధానంలో నీటిలోని మలినాలతోపాటు ఆరోగ్యానికి అవసరమైన మినరళ్లూ వడపోతకు గురవుతాయని తెలిపారు. 'మినరల్ బేస్డ్ టెక్నాలజీతో నడిచే యంత్రాల వల్ల నీరు ఎక్కువ వృథా అవదు. మలినాలే వేరవుతాయి. మినరళ్లు అలాగే ఉంటాయి. రసాయనాలు లేనందున కాలుష్యమనే ప్రశ్నేలేదు' అని రామ్మోహన్ వివరించారు. కార్యక్రమంలో గ్రేటర్ కమిషనర్ డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





గొల్లకిడికీలో జెమ్స్‌తో రూపొందించిన గణేశుడు



గుల్జార్‌హౌస్‌లో ఎండు ఫలాలతో..



ఛత్రినాకలో పంచముఖ గణనాథుడు



కోకాబజార్‌లో బంతులతో..



లాల్‌దర్వాజాలో కుందన్‌గణేష్

మనసంతా.. ఏకదంత

విభిన్న రూపాల్లో కొలువుదీరి పూజలందుకుంటున్న గణనాథుడు

నగరం

గణపతి బప్పా మోరియా నినాదాలతో మార్మోగుతోంది. నవరాత్రులపాటు పూజలు అందుకునేందుకు విఘ్నేశుడు మండపాల్లో కొలువుదీరాడు. ప్రత్యేక శైలిలో అలంకరించిన మండపాల్లో విభిన్న ఆకృతులు, వస్తువులతో రూపొందించిన గణనాథుడ్ని ప్రతిష్ఠించారు. పర్యావరణహిత విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం వినాయక నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండపాల్లో కొలువుదీరిన ఏకదంతుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి కొలిచారు. భారీ వర్షంలోనూ వేడుకలు అంబరాన్ని అంటుతున్నాయి.

మరిన్ని చిత్రాలు www.eenadu.netలో చూడండి.



సికింద్రాబాద్‌లోని గోల్డ్ బజార్‌లో ప్రత్యేక మండపంలో కొలువుదీరిన ఏకదంతుడు



సికింద్రాబాద్ గణపతి ఆలయంలో నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. పాండురంగ దేవాలయం నుంచి మృణ్మయ గణపతి ఉత్సవమూర్తిని లాంఛనాలతో ఆహ్వానించి ప్రతిష్ఠించారు. దీక్షాధారణ, అంకురార్పణ, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు. మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఎంపీ మల్లారెడ్డి దర్శించుకున్నారు.– న్యూస్‌టుడే, రెజిమెంటల్‌బజార్



బేగంబజార్ ప్రధాన రహదారిలో లవ్ హైదరాబాద్‌పై..



లోయర్‌ట్యాంక్‌బండ్‌లో 65 అడుగుల పర్యావరణహిత వినాయకుడు



పాతబస్తీలోని నాగులచింత ప్రాంతంలో..




భాజపా రాష్ట్ర కార్యాలయంలో వినాయకచవితి పూజల్లో పాల్గొన్న కేంద్రమంత్రి దత్తాత్రేయ, ఎమ్మెల్యేలు లక్ష్మణ్, కిషన్‌రెడ్డి



సీఎం కేసీఆర్ నివాసంలో పూజల్లో పాల్గొన్న ఆయన సతీమణి శోభ, మనవడు, మనవరాలు





సుల్తాన్‌బజార్‌లో 25కిలోల బంగారంతో గణేషుడి పాదాలు, దంతాలకు అలంకరించిన తొడుగులు





ఖైరతాబాద్‌లోని మహాగణపతిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి వేర్వేరుగా సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.



శనివారం హుస్సేన్‌సాగర్‌లో ప్రతిమలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఉపకమిషనర్ విజయలక్ష్మి

వర్షానికి కూలిన బతుకు..

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: వర్షంతో నానిన పాతగోడ కూలిపోయి రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో ఓ వ్యక్తి మరణించాడు. ఎస్సై రాజేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా లింగాలపల్లికి చెందిన వెంకటయ్య(33) ఉప్పర్‌పల్లిలో నివసిస్తూ కూలి పనులు చేస్తుంటాడు. సులేమాన్‌నగర్ సమీపంలో నిర్మిస్తున్న భవనంలో సిద్దీఖీ అనే గుత్తేదారు వద్ద పనికి చేరాడు. నిర్వాహకులు పాతభవనం గోడలు మొత్తం తొలగించకుండా ఒకవైపు అలాగే ఉంచి పనులు చేపట్టారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పాత గోడ బాగా తడిసిపోయింది. కాగా శనివారం వెంకటయ్య నానిపోయిన పాత గోడ పక్కన పనిచేస్తుండగా ఒక్కసారిగా కూలి అతనిపై పడింది. తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. మృతుడికి భార్య అలివేలు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల ధర్నా.. గోడ కూలీ మృతిచెందిన వెంకటయ్య కుటుంబానికి న్యాయం చేయాలని అతని బంధువులు సంఘటన స్థలంలో ఆందోళన చేపట్టారు. ఘటనాస్థలాన్ని రాజేంద్రనగర్ ఉపకమిషనర్ విజయలక్ష్మీ సందర్శించారు. భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతి లేదని ఉపకమిషనర్ వివరించారు. అనుమతి లేకుండా నిర్మించొద్దని సదరు యజమానికి మొదట నోటీసు కూడా జారీ చేసినట్లు ఆమె తెలిపారు. అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణం కావడంతో యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసే విధంగా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు. మరో రెండు నోటీసులు జారీ చేసి ప్రస్తుతం నిర్మించిన అక్రమ భవనాన్ని కూల్చివేస్తామని తెలిపారు.



కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ వద్ద కారుపై పడిపోయిన విద్యుత్ స్తంభం

కూకట్‌పల్లిలో కూలిన విద్యుత్తు స్తంభాలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లిలో ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. నాలా పరివాహక ప్రాంత వాసులకు కునుకు కరవైంది. కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ వద్ద బిగ్‌బజార్ ముందు శుక్రవారం రాత్రి నాలుగు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ఓ కారుపై పడడంతో స్వల్పంగా ధ్వంసమైంది. కొన్ని స్తంభాలు రెండు, మూడు ముక్కలయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో శనివారం ఉదయం వరకు విద్యుత్తు సరఫరా కాలేదు. మెట్రోస్టేషన్ పక్కన సర్వీసు రోడ్డు అభివృద్ధిలో భాగంగా స్తంభాలకు సమీపంలో తవ్వడంతో వర్షానికి అవి కూలిపోయాయని ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు. విద్యుత్తు సిబ్బంది శనివారం స్తంభాల పునరుద్ధరణకు ప్రయత్నించగా మెట్రో అధికారులు అది తమ స్థలమంటూ అడ్డుకున్నారు. చర్చల అనంతరం సాయంత్రానికి స్తంభాను నెలకొల్పారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి ఎంఎంఆర్ గార్డెన్స్ పక్క రోడ్డు నడుము లోతు నీటితో నిండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.



దిల్‌సుఖ్‌నగర్‌లో వరద నీటితో స్థానికుల తిప్పలు



కోదండరామ నగర్‌లో అపార్ట్‌మెంట్ వాసుల అవస్థలు



శనివారం రాత్రి హిమాయత్‌నగర్ - లిబర్టీ మార్గంలో వరద ప్రవాహంలో వాహనాలు

వణికించిన వర్షం

నగరంలోని వందలాది కాలనీలు శుక్రవారం రాత్రి వర్షానికి వరదలో మునిగాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్ సెల్లార్లలోని నీరు చేరింది. బల్దియా అధికారులు పలుచోట్ల ఆహార పొట్లాలు అందించారు. అత్యవసర బృందాలు నీళ్లు తోడటంలో నిమగ్నమయ్యాయి. వరదకు పలుచోట్ల వాహనాలు కొట్టుకుపోయాయి. హుస్సేన్‌సాగర్‌లో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. సాగర్‌కు, దిగువనున్న పరివాహక ప్రాంతాలకు అపాయం లేదని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేసింది. వరదతో మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగి పొర్లాయి. శుక్రవారం వినాయక చవితి సెలవు కావడంతో శుక్రవారం రద్దీ తక్కువగా ఉంది. లేదంటే తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడేదని అధికారులు పేర్కొన్నారు. కాగా శనివారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా పలుచోట్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

పదేళ్ల రికార్డుకు చేరువ

నగరంలో శుక్రవారం రోజు అత్యధికంగా 12.8 సెం.మీ. రికార్డు వర్షపాతం కురిసింది. ఇప్పటి వరకు పదేళ్ల కాలంలో 2009 ఆగస్టు 18న రికార్డు స్థాయిలో 13.3 సెం.మీ. వాన కురిసింది. తర్వాత ఈసారే అత్యధికం. మొత్తంగా చూస్తే 2000 ఆగస్టు 24న కురిసిన 24 సెం.మీ. ఇప్పటివరకు అత్యధికం. – ఈనాడు, హైదరాబాద్

భారీ నురగ.. 'ధరణి' బెంగ

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: చూస్తుంటే ఏదో మంచు పర్వతాల మధ్య ఉన్నామా అన్నట్లుగా అక్కడ పరిస్థితి కనిపించింది. కానీ అది ఆహ్లాదకర వాతావరణం కాదు.. ఓ చెరువు నుంచి వచ్చిన 'నురగ' ప్రభావం.. ఎదుట ఎవరున్నారో కనిపించనంతగా ఉండడంతో జనం ఆందోళన చెందారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ డివిజన్ ధరణీనగర్‌కాలనీలో శనివారం ఉదయం పరిస్థితి ఇది. వర్షానికి మురుగుతో పాటే నురగ సైతం ఇళ్లను ముంచెత్తడంతో కాలనీవాసులు కనకదుర్గ ఆలయంలో తలదాచుకున్నారు. ఇళ్లలోకి వెళ్లలేక, తినేందుకు తిండిలేక అలాగే ఉండిపోయారు. నురగలో చిక్కుకున్నవారిని పోలీసులు వచ్చి బయటకు తీసుకువచ్చారు. జూన్‌లో కురిసిన వర్షానికి ఇలాగే నురగ రాగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నమూనాలు తీసుకువెళ్లారని, ఇళ్లలోని వ్యర్థ జలాలతోనే నురగ వస్తోందని చెప్పారని స్థానికులు వాపోయారు. వాస్తవానికి చెరువు రసాయనాలతో కలుషితం కావడం వల్లనే సమస్య వస్తోందన్నారు. నురగ వల్ల దుర్వాసనతో పటు అది పడిన చోట చర్మంపై మంటలు వస్తున్నాయని చెప్పారు. శనివారం మధ్యాహ్నం జీహెచ్‌ఎంసీ సిబ్బంది వచ్చి సమస్య పరిష్కారానికి రసాయనాలు పిచికారీ చేశారు.



నురగతో ఇళ్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువస్తున్న పోలీసులు

మియాపూర్‌లో వర్ష బీభత్సం

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్‌లో శుక్రవారం కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. చందానగర్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ, దీప్తిశ్రీనగర్, కృష్ణదేవరాయ నగర్, ఆదర్శనగర్, శాంతినగర్, సీబీఆర్ ఎస్టేట్స్, దుర్గా ఎస్టేట్స్‌లోని అపార్టుమెంట్‌లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీప్తిశ్రీనగర్ దగ్గర జాతీయ రహదారిపై వరద నీరు పోటెత్తి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అపార్టుమెంట్లలో రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. దుకాణాలు, వాహనాలు నీట మునిగిపోయాయి. ముంపు ప్రాంతాలను శేరిలింగంపల్లి శాసనసభ్యుడు గాంధీ, జోనల్ కమిషనర్ హరి చందన, ఉప కమిషనర్ వెంకన్న పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వెంటనే నాలా పునరుద్ధరణ చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. చందానగర్ కార్పొరేటర్ నవతారెడ్డి, జీహెచ్‌ఎంసీ సిబ్బంది దీప్తిశ్రీనగర్‌తో పాటు సీబీఆర్ ఎస్టేట్ ప్రాంతాన్ని సందర్శించి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాదాపూర్, హఫీజ్‌పేట డివిజన్ల కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, పూజిత రామకృష్ణానగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.





కృష్ణదేయరాయనగర్, దీప్తిశ్రీనగర్‌లో వరద పరిస్థితి



ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతంలో పరస్పరం క్షేమ సమాచారం తెలుసుకుంటున్న స్థానిక మహిళలు

రహదారుల దిగ్బంధం

ముంచెత్తిన నీటితో ఆగిపోయిన వాహనాలు ● ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్య ● తీవ్ర అవస్థలు చవిచూసిన ప్రయాణికులు

ఈనాడు, హైదరాబాద్

నగరవాసిని భారీ వర్షం వణికించింది. శుక్ర, శని వారాల్లో ముంచెత్తిన వానతో జనం అల్లాడిపోయారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు భారీ వానతో వరద, మురుగు ప్రవాహం ఉరకలెత్తి ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, కంట్రోల్‌రూం, ఆబిడ్స్, కోఠి, మలక్‌పేట, అంబర్‌పేట, గోల్నాక, కాచిగూడ, బర్కత్‌పురా, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ముషీరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో వర్షం తీవ్ర ప్రభావం చూపించింది. బస్‌స్టాప్‌లలో పలువురు తడుస్తూనే బస్సుల కోసం నిరీక్షించారు. రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు శక్తిమేర చర్యలు చేపట్టారు.

అన్నీ గోదారులే... రెండు రోజుల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులన్నీ గోదారిని తలపించాయి. రోడ్లపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది ఏర్పడింది. ఇరుకుగా ఉండే ట్యాంక్‌బండ్- లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, సికింద్రాబాద్, జనరల్ బజార్, ప్యారడైజ్, ప్యాట్నీ, బేగంపేట, రసూల్‌పురా, మినిస్టర్‌రోడ్ రాణిగంజ్, మోండా, మార్కెట్, మహంకాళి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టల వద్ద వాహనాలు ఆగిపోయాయి. వర్షం గంటన్నరసేపే కురిసినా.. రాత్రి 9 గంటలకు ట్రాఫిక్ సాధారణ స్థితికి వచ్చింది.

మెట్రో గుంతల్లో నీరు... మెట్రోరైలు పనులు, రైల్వే స్టేషన్లు నిర్మాణమవుతున్న చోట్ల తీసిన గుంతల్లో నీరు నిండి రోడ్లపైకి రావడంతో లక్డీకాపూల్, రవీంద్రభారతి, నాంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంతాలు జలమయమయ్యాయి. నీటిని కాలువల్లోకి పంపేందుకు ట్రాఫిక్, మెట్రో, జీహెచ్‌ఎంసీ అధికారులు లేకపోవడంతో గంటపాటు వాహన చోదకులు అలానే రాకపోకలు కొనసాగించారు.



శనివారం రాత్రి వర్షానికి ఖైరతాబాద్ కూడలిలో భారీగా నిలిచిపోయిన వాహనాలు

ఖైరతాబాద్, లక్డీకాపూల్‌లో ట్రాఫిక్ మందకొడిగా వెళ్తుండడంతో మెహిదీపట్నం, సరోజినీదేవి కంటి ఆసుపత్రి, మాసాబ్‌ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్ అధికారులు కొన్ని చోట్ల ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు.

అయ్యో.. ఆ మార్గాలు... ● ఆబిడ్స్-చిరాగ్ అలీ మార్గం నుంచి రెడ్‌రోజ్ ఫంక్షన్‌హాల్-నాంపల్లి రహదారిపై నీళ్లు ప్రవహిస్తుండంతో రెండువైపులా రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

● బీజేఆర్ విగ్రహం, ఆబిడ్స్, చర్మాస్ తాజ్‌మహల్ హోటల్ జీపీవో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించి పోయింది. గంట తర్వాతే సాధారణ పరిస్థితి నెలకొంది. ● ప్యారడైజ్, సీటీవో, రోచా బజార్ ప్రాంతంలో వర్షం కారణంగా నీళ్లు రహదారులపై ప్రవహిస్తుండడం, కూడళ్ల వద్ద ట్రాఫిక్ స్తంభించి పోవడంతో ద్విచక్రవాహన చోదకులు అవస్థలు చవిచూశారు. ● తెలుగుతల్లి కూడలి సమీపంలో వాననీరు రోడ్లపైకి రావడం, ప్రవాహం వేగంగా ఉండడంతో ట్యాంక్‌బండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వైపు వెళ్లే వాహనాలు 15 నిమిషాల పాటు ఆగిపోయాయి. ● దిల్‌సుఖ్‌నగర్ నుంచి మలక్‌పేట శ్రీవాణి మహిళా డిగ్రీ కళాశాల, నల్గొండ జంక్షన్, మలక్‌పేట రైల్వేస్టేషన్ చాదర్‌ఘాట్ రోటరీ మీదుగా వెళ్లే వాహనాలు మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద నీటి ప్రవాహానికి ఆగిపోయాయి. ● వర్షం నీటి వల్ల మదీనా జంక్షన్ వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. నయాపూల్, అఫ్జల్‌గంజ్, సిద్ధిఅంబర్ బజార్, మొజంజాహీ మార్కెట్ వైపు వెళ్లే వాహనాలు అరగంటకుపైగా ఆగాల్సి వచ్చింది. ● పుత్లిబౌలి,రంగమహల్, ఆబిడ్స్ వైపు రోడ్లపైనే నీళ్లు ఆగిపోవడంతో రాత్రి 9గంటలకు ప్రయాణం సజావుగా కొనసాగింది. ● ఖైరతాబాద్-కేసీబీ కూడలి, ఖైరతాబాద్-మలక్‌పేట వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది.



బురదమయంగా మారిన వెంకటేశ్వరనగర్ రహదారి



నీటి సంపులోకి చేరిన మురుగు



అల్లంతోటబావి, పికెట్ నాలా ప్రాంతాలను పరిశీలిస్తున్న జనార్దన్‌రెడ్డి

అర్ధరాత్రి వేళ.. కమిషనర్ పరిశీలన

అమీర్‌పేట, న్యూస్‌టుడే: వర్షం, వరదల వల్ల తలెత్తే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జీహెచ్‌ఎంసీ యంత్రాంగం సిద్ధంగా ఉందని కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. భారీ వర్షానికి నీట మునిగిన బేగంపేటలోని పలు బస్తీలను శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కమిషనర్ సందర్శించారు. వరద సమస్యను, స్థానికుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అల్లంతోటబావి, పికెట్‌నాలా, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. వరద ముంపు సమస్య తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలను గురించి అధికారులకు సూచనలిచ్చారు. వరద ముంచెత్తిన బస్తీల నుంచి నీటిని తోడేయాలన్నారు. వరద ప్రభావితులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలిస్తామని, అన్ని విభాగాల సిబ్బందితో సమన్వయంగా వ్యవహరిస్తూ పరిస్థితిని చేయిదాటకుండా చూస్తామని చెప్పారు. తెరాస సీనియర్ నాయకులు డి.వి.నరేందర్‌రావు కమిషనర్ వెంట ఉండి స్థానిక ప్రాంతాల్లో పరిస్థితిని చూపించారు. ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, అల్లంతోటబావి, బ్రాహ్మణవాడి ప్రాంతాల్లో వరద నీరు ముంచెత్తడంతో ఇళ్లలోకి అడుగు లోతు నీరు చేరింది. బ్రాహ్మణవాడిలోని పలు వినాయక మండపాల్లోకి వరద నీరు పోటెత్తింది.

కంట్రోల్ రూం ఏర్పాటు

బంజారాహిల్స్: నగరంలో వర్ష ప్రభావాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ డా.బి.జనార్దన్‌రెడ్డి స్వయంగా కంట్రోల్‌రూం ద్వారా శనివారం పరిస్థితిని పర్యవేక్షించారు. రాష్ట్రంలో మేఘాల గమనం, జీహెచ్‌ఎంసీ పరిధిలో వాటి ప్రభావం తదితర అంశాలను విపత్తుల నివారణ విభాగం అధికారులతో సమీక్షించారు. అత్యవసర బృందాలు అప్రమత్తతతో ఉండాలనీ, డాప్లర్ రాడార్ ద్వారా అందే సమాచారాన్ని సంబంధిత ఇంజినీర్లకు, అధికారులకు పంపించి అప్రమత్తం చేయాలని కమిషనర్ సూచించారు. ఆదివారమూ వర్షాలు ఉండటంతో కంట్రోల్‌రూంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యుత్తుకు అంతరాయం

ఈనాడు, హైదరాబాద్: భారీ వర్షంతో మియాపూర్‌లోని కొన్ని కాలనీల్లో అపార్ట్‌మెంట్ సెల్లార్లు నీట మునగడంతో ముందు జాగ్రత్తగా విద్యుత్తు సరఫరా నిలిపేశారు. 24 గంటలు గడిచినా వీరికి సరఫరా పునరుద్ధరించలేదు. శుక్రవారం కురిసిన వానకు నగరంలో 150 వరకు బ్రేక్‌డౌన్లు అయ్యాయి. చెట్లు విరిగి తీగలపై పడటంతో పలు ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది. ఎస్‌ఆర్‌నగర్, తార్నాక, బర్కత్‌పుర ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఉదయానికి చాలా వరకు సరఫరా పునరుద్ధరించినా.. నీరు నిల్చిన ప్రాంతాల్లో మాత్రం శనివారం రాత్రి అంధకారంలో గడపాల్సి వచ్చింది. బేగంపేట ప్యాట్నీ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు పోయిన విద్యుత్తు శనివారం రాత్రి వరకూ రాలేదు. 50 ఇళ్ల వరకు అంధకారంలో ఉన్నాయి. పెద్ద ఎత్తున మురుగునీరు ఆ ప్రాంతాన్ని ముంచెత్తడంతో విద్యుత్తు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సరఫరా నిలిపేసినట్లు ఇంజినీర్లు చెప్పారు.



జల పరవశం

వర్షాలకు చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువులోకి భారీగా నీరు చేరి సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇక్కడి హనుమాన్ దేవాలయానికి వచ్చే భక్తులకు పక్కనే ఉన్న ఈ సుందర దృశ్యం కనువిందు చేస్తోంది. –చందానగర్, న్యూస్‌టుడే

రాజేంద్రనగర్

ఎన్ఎస్ఎస్ అధికారికి అవార్డు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజేశ్వర్‌నాయక్‌కు అవార్డు లభించింది. తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ సామాజిక సేవాసంస్థ మదర్‌థెరిసా జయంతిని పురస్కరించుకొని మదర్‌థెరిసా మెమోరియల్ అవార్డును అందజేసింది. అవార్డు రావడంపట్ల రాజేశ్వర్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు.

వరుణుడి అలజడి



చిత్రపురిహిల్స్ సమీపంలో నీటిలో కార్మికుల రేకుల షెడ్లు...

- భారీ వర్షానికి పొంగిన కాలువలు
- వరద ఉద్ధృతికి రహదారులు ధ్వంసం
- జంట గ్రామాల్లోని కాలనీలు జలమయం

మణికొండ, న్యూస్‌టుడే: కుండపోత వర్షానికి శివారు గ్రామాల్లోని కాలనీల్లో వరదనీరు ఉద్ధృతంగా ప్రవహించింది. శుక్రవారం రాత్రి నుంచి పొద్దుపోయే వరకు భారీ వర్షానికి మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాల్లో వరదనీరు లోతట్టు వీధులో నిలిచిపోయింది. ప్రధాన రహదారిలో వరద చేరడంతో.. గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల్లో కురిసిన వర్షానికి పొలాల్లో భారీగా నీరు చేరింది. వచ్చే నెక్నాంపూర్ అల్కాపూర్ టౌన్‌షిప్, మణికొండ హుడాకాలనీ, పుప్పాలగూడలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ వీధులు ఇప్పటికే దెబ్బతినగా.. వరద ఉద్ధృతికి మరింత అధ్వానంగా మారాయి.

ఉద్ధృతంగా వరద కాలువలో ప్రవాహం..

దుర్గంచెరువు, ఖాజాగూడ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వరదనీటితో మణికొండ, పుప్పాలగూడ గ్రామాల మీదుగా వెళ్లే పందెన్‌వాగు, బుల్కాపూర్ కాలువలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంచవటికాలనీలో పందెన్‌వాగు కాలువకు ఆనుకొని ఉన్న పలు అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి నీరు చేరింది. కాలువ మీదుగా వారు ఏర్పాటు చేసుకున్న స్లాబ్ నిర్మాణాల వెంట భారీగా వరదనీరు వచ్చి సెల్లార్లలోకి చేరింది. కాలనీలో నెలకొన్న పరిస్థితిని చక్కదిద్దేందుకు మణికొండ సర్పంచి కె.నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాఘవరెడ్డి, కాలనీవాసులు అక్కడికి చేరుకొని జేసీబీతో కాలువలో నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు.



పంచవటికాలనీలో కాలువను పరిశీలిస్తున్న డీఎంసీ మమత, సర్పంచి నరేందర్‌రెడ్డి

మల్కాచెరువు నుంచి దిగువ కాలువలోకి చేరుతున్న వరదనీటిని శేరిలింగంపల్లి డీఎంసీ మమత, ఈఈ సుదర్శన్, కార్పొరేటర్ సాయిబాబాలు పరిశీలించారు.

వర్షంతో నిలువ నీడ లేకుండా..

శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మణికొండ ఎల్లమ్మ చెరువు దిగువన లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. చిత్రపురిహిల్స్‌లో నిర్మాణ పనుల్లో పనిచేసే కార్మికుల కోసం ఏర్పాటు చేసిన రేకుల షెడ్లలో మూడు అడుగుల నీరు చేరడంతో వారంతా నిలువ నీడ లేని పరిస్థితి నెలకొంది. చిత్రపురి హిల్స్‌లో పనిచేసే వందలాది కార్మిక కుటుంబాలు ఈ రేకుల షెడ్లలోనే ఉంటున్నారు. గతంలో హైటెన్షన్ టవర్ల తీగలకు సమీపంలోనే వీరు రేకుల షెడ్లు వేసుకోవడం.. తరుచూ సెల్ సిగ్నల్స్.. విద్యుత్తు సరఫరాల్లో విద్యుదాఘాతాలు ఏర్పడడంతో.. సమీపంలోని మరో ప్రాంతానికి రేకుల షెడ్లను తరలించారు. అయితే ప్రస్తుతం ఉంటున్న ప్రాంతం లోతట్టు ప్రదేశం కావడంతో రాత్రి కురిసిన భారీ వర్షంతో అక్కడున్న షెడ్లలోకి నీరు చేరింది. సమస్యను ముందే పసిగట్టిన కొందరు.. తాము పనిచేస్తున్న సముదాయంలోకి వెళ్లి తలదాచుకున్నారు.



నెక్నాంపూర్‌లో నిర్మాణంలో ఉన్న కొలను

కొనసాగుతున్న కొలను పనులు..

వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కావడంతో.. గణనాథుల నిమజ్జనం కోసం నెక్నాంపూర్ చిన్నచెరువు వద్ద నిర్మిస్తున్న కొలను పనులు వేగం పుంజుకున్నాయి. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కొలనులో కొద్దిమేర నీరు చేరింది. పనులు పూర్తికాకపోతే ఇబ్రహీం చెరువులో గణనాథుల నిమజ్జనం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దారి నిర్మించుకోండి.. కలిసి ఉండండి



పార్కు స్థలంపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

కాటేదాన్, న్యూస్‌టుడే: ఉన్న తలుపుకు పార్కులో నుంచి మనుషులు నడిచేలా ఓ ప్రహరి గోడ నిర్మించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్థానికులకు సూచించారు. ఇటీవల మైలార్‌దేవుపల్లి డివిజన్ బస్తీలో ప్రారంభమైన జీహెచ్ఎంసీ పార్కు పక్కనే ఉన్న వక్ఫ్ బోర్డు స్థలం, ఆపై మసీదు స్థలం ప్రహరీకి తలుపు నిర్మించి ఉంది. ఆ తలుపుతో గత మూడునెలలుగా వివాదం కొనసాగుతోంది. కాగా శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పార్కు స్థలాన్ని పరిశీలించారు. మసీదు స్థలంలోని శ్మశానవాటికకు ఉన్న తలుపు ముందు రాకపోకలు సాగేలా ప్రహరీ నిర్మించుకోవాలని సూచించారు. ఇరువర్గాల ప్రజలు సామరస్యంగా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని నచ్చచెప్పారు. రాజకీయం రంగు అంటుకోకుండా.. ప్రలోభాలకు లోనుకాకుండా బస్తీ ప్రజలు కలిసిమెలసి ఉండాలని హితవు చెప్పారు. సర్కిల్ ఈఈ లచ్చీరామ్, డీఈ శివశంకర్‌గౌడ్, డివిజన్ తెరాస అధ్యక్షులు సరికొండ వెంకటేష్, షేక్ ఫయీం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు అంతరాయాలతో అవస్థలు

మణికొండ, న్యూస్‌టుడే: నెక్నాంపూర్ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో కొన్ని రోజులుగా తరుచూ విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని నియంత్రికల వద్ద భద్రత ప్రమాణాలు విస్మరించడంతో పాటు.. సరఫరాలో తరుచూ అంతరాయం కలుగుతోందని టౌన్‌షిప్‌వాసులు వెల్లడిస్తున్నారు. కాలనీలో స్తంభాలపై వదులుగా ఉన్న తీగలను సరిచేయడంతో పాటు నియంత్రికల వద్ద ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు సూచిస్తున్నారు. ఈ విషయమై పుప్పాలగూడ ఏఈ రామేశ్వరశెట్టిని వివరణ కోరగా.. టౌన్‌షిప్‌లో విద్యుత్తు తీగల మార్పు, ఇతర పనులు చేపట్టామని, నియంత్రికల వద్ద త్వరలోనే అవసరమైన పనులు చేపడుతామని, మరో వారం రోజులు సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు. వినాయక విగ్రహాలకు ఇబ్బందులు రాకుండా కాలనీలోని పలు వీధుల్లో కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొన్ని నెలల్లోనే కాలనీలో రూ.కోటి వ్యయంతో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మించనున్నామని వివరించారు.

ఘనంగా మదర్‌థెరిసా జయంతి



మదర్‌థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కాటేదాన్, న్యూస్‌టుడే: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే మిన్న అని వాస్తవికతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు మదర్‌థెరిసా అని రాజేంద్రనగర్ నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి పేర్కొన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన థెరిసా జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వందమందికి ఒకేసారి నీవు సహాయం చేయకపోయినా... ఒక్కరికైనా తమవంతుగా ఆదుకోవాలనే మదర్‌థెరిసా మాటలను ఆయన గుర్తుచేశారు. రంగనాయకులు, రమేష్‌రెడ్డి, వేణుకుమార్, జంగయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఇంటర్మీడియెట్ కీలకమైన దశ అని, ప్రతి ఒక్కరు స్పష్టమైన లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి జయప్రదబాయి అన్నారు. హైదర్‌గూడలోని విజ్ఞాన్‌జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ 'బ్లూమింగ్‌బర్డ్స్' పేరుతో నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు. చెడు వ్యసనాల బారిన పడొద్దని సూచించారు. ఓయూ ఆచార్యులు చెన్నప్ప, కళాశాల ఛైర్మన్ సతీష్, బండారినారాయణ, మానస, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

చెరువులు.. నిండుకుండలు



అలుగు పారుతున్న గొల్లపల్లి పెద్ద చెరువు



గొల్లపల్లిలో నీట మునిగిన వరి

శంషాబాద్ గ్రామీణ: వరుసగా కురుస్తున్న వర్షాలకు పెద్దగొల్లపల్లి పెద్దచెరువు నిండుకుండలా మారింది. విమానాశ్రయం చెరువులో మరమ్మతుల పనులు సాగుతుండడంతో వరద నీటిని కిందకు వదులుతున్నారు. దీంతో గొల్లపల్లి చెరువు పూర్తిగా నిండిపోయింది. మిషన్ కాకతీయ పథకంలో పూడిక మట్టిని తొలగించడంతో చెరువు వరద నీటితో కళకళలాడుతుంది. చెరువు శిఖం సమీపంలో రైతులు సాగు చేసిన వరి పంట నీట మునిగింది. గొల్లపల్లి చెరువు నిండుకొని అలుగు పారుతుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దిగువ ఉన్న తొండుపల్లి చెరువులోకి వరద నీరు చేరుతుంది. ఇలానే వర్షాలు కురుస్తే నాలుగేళ్లుగా నోరు తెరుచుకొని నీటి కోసం ఎదురు చూస్తున్న తొండుపల్లి చెరువు అలుగు పారడం ఖాయమని రైతులు పేర్కొంటున్నారు.

మున్నూరు కాపు సంఘం సమావేశం నేడు

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్‌లో ఈనెల 27న రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. శంషాబాద్ మండల కేంద్రంలో మున్నూరుకాపు కులస్థుల ఐక్యత కోసం తలపెట్టిన ఈ సమావేశం ఎంఎంఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

విజయగణపతి ఆలయంలో మండపం ప్రారంభం

నార్సింగి: హైదర్షాకోట్ భాగ్యనగర్ కాలనీలోని శ్రీవిజయగణపతి ఆలయ ప్రాంగణంలో దాత మఖన్‌లాల్ అగర్వాల్ తన తండ్రి జ్ఞాపకార్థం శ్రీవిజయదుర్గ ఆలయం ముందు రూ.8లక్షలతో నిర్మించిన మండపాన్ని గ్రామ సర్పంచి కృష్ణారెడ్డి ప్రారంభించారు. కె.రాంనరేశ్, రాంచంద్రయ్య, సురేందర్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాజేంద్రనగర్



వాడవాడా.. నిన్ను చూడ

☛ బస్తీల్లో కొలువుదీరిన గణనాథుడు

☛ వర్షంలోనూ ఘనమైన పూజలు



పూజల్లో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి..



శంషాబాద్‌లో మండప అలంకరణ



గణేష్‌నగర్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



శ్రీవిజయ గణపతి ఆలయంలోని మట్టి గణపతి



లక్ష్మీనర్సింహస్వామి మండపంలో పూజలు

కాటేదాన్, న్యూస్‌టుడే: గణేష్ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా ఆదిపూజ్యుడిని ప్రతిష్ఠించి ఘనంగా పూజలు చేశారు. మరోవైపు పర్యావరణ హితమే విఘ్నేశ్వర అభిమతమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. కాటేదాన్ గణేష్‌నగర్ బంగారు మైసమ్మ దేవాలయం ఎదుట ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ మారు ప్రత్యేకంగా ఆరడుగుల మట్టి వినాయకుడిని ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టి వినాయకులపై నియోజకవర్గం ప్రజలు ఆసక్తి చూపుతున్నారని ఇది మంచి పరిణామమని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో మట్టి వినాయకుడిని ప్రతిష్టించారు. కాటేదాన్ వివేకానంద యూత్‌క్లబ్ వారు తమ మండపంలో మట్టి గణేష్‌కు పూజలందిస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, ఎమ్మెల్యే సూచన మేరకు మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో దాదాపు 35 శాతం మట్టి వినాయకులను ఏర్పాటు చేసినట్లు పలు ఉత్సవ కమిటీల సభ్యులు తెలిపారు. నేతాజీనగర్, దుర్గానగర్, మైలార్‌దేవుపల్లి శ్రీరామాంజనేయ ఆలయం, లక్ష్మీగూడ హనుమాన్ ఆలయం మండపం, పల్లెచెరువు హరిజన బస్తీ, వినాయక్‌నగర్, మైలార్‌దేవుపల్లి, శాస్త్రిపురం, లక్ష్మీగూడ హౌసింగ్‌బోర్డు కాలనీ తదితర బస్తీల్లో రెండువేలకు పైగా గణనాథులు కొలువయ్యారు.

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సర్కిల్లోని అన్ని బస్తీలలోను పదుల సంఖ్యలో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఒకవైపు వర్షం పడుతున్నా అన్ని బస్తీలలో పూజలు మాత్రం ఘనంగా నిర్వహించారు. అత్తాపూర్ మణికంఠ భక్త సమాజం ఆధ్వర్యంలోని వినాయకుడి వద్ద ప్రత్యేక భక్తిగీతాలతో భజన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తెరాస నాయకులు సురెందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హైదర్‌గూడ నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహం ప్రతిష్ఠించారు. నలందానగర్ కాలనీలో అసోసియేషన్ సభ్యులు మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లోని శ్రీవెంకటేశ్వరాలయం హరిహరక్షేత్రంలో ప్రతిష్ఠించిన వినాయకుడి పూజల్లో రాజేంద్రనగర్ సీఐ ఉమెందర్, ఆలయకమిటీ అధ్యక్షులు డా. అమరేందర్ పాల్గొన్నారు.



వేంకటేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న సీఐ ఉమెందర్

బుద్వేల్, హుడాకాలనీ, ఎర్రబోడ, రాధకృష్ణనగర్, శివానగర్ కాలనీ, కృష్ణనగర్‌కాలనీ, కేశవ్‌నగర్, శివరాంపల్లి తదితర బస్తీలలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు.

నార్సింగి: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు శివారు గ్రామాల్లో సాంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. హైదర్షాకోట్ శ్రీవిజయగణపతి ఆలయం ప్రాంగణంలో మట్టి గణపయ్యను ఎకోఫ్రెండ్లీగా అలంకరించారు. గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపయ్యకు గ్రామ సర్పంచి కృష్ణారెడ్డి పూజలు చేశారు. బండ్లగూడ శారదాధామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శిశుమందిర్ విద్యార్థులు భక్తిప్రపత్తులతో పూజలు, భజనలు చూస్తున్నారు.

మణికొండ: మణికొండ, పుప్పాలగూడ, నేక్‌నాంపూర్ గ్రామాల్లో గణేస్ మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. రాత్రి ఎనిమిది గంటల నుంచి భారీ వర్షం కురవడంతో.. పలు మండపాల వద్ద పూజ కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం సైతం వర్షం రావడంతో మండపాల వద్ద భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. పలు మండపాల వద్ద ముందుగా నిర్దేశించుకున్న కార్యక్రమాలను మరో రెండురోజులకు వాయిదా వేసుకున్నారు.

☛ మణికొండ పోచమ్మబస్తీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వార్డుసభ్యురాలు వాణి, రమేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ తలారి మల్లేష్మదిరాజ్, తెరాస మండల అధ్యక్షుడు ఆర్.నర్సింహా, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీరాములు పాల్గొన్నారు. అనంతర అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. మణికొండ శివపురికాలనీ, శివాజీనగర్ తదతర కాలనీల్లో జరిగిన వేడుకల్లో సర్పంచి కె.నరేందర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఉపసర్పంచి ఎల్.నాగేష్ పిసరి శ్రీనివాస్, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.



మణికొండ పోచమ్మబస్తీలో ఎంపీపీ మల్లేష్ పూజలు



మణికొండలో పూజలు నిర్వహిస్తున్న సర్పంచి నరేందర్‌రెడ్డి



అత్తాపూర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి వద్ద భక్తులు

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

శంషాబాద్ గ్రామీణ: శంషాబాద్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో చోరీ చేసిన దొంగలు.. తాజాగా శనివారం శంషాబాద్, సిద్దాంతి బస్టాప్ వద్ద ఉన్న ఆంజేయస్వామి ఆలయంలో హుండీని ధ్వంసం చేశారు. ఆర్జీఐఏ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి దొంగలు ఆలయంలోకి చొరబడ్డారు. ఆలయం హుండీని పెకలించి బయటకు తెచ్చారు. హుండీ తాళాలను విరగ్గొట్టి అందులో ఉన్న నగదు, నగలు ఎత్తుకెళ్లారు. హుండీలో ఎంత మేరకు నగదు, నగలు ఉన్నాయో ఆలయ కమిటీ సభ్యులు నిర్ధారించలేక పోతున్నారు. ఆర్జీఐఏ క్రైం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే తెరాస ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్‌లో శనివారం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంపై దృష్టి పెట్టిందన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఇక్కడ నీటి సమస్య, తరగతి గదుల కొరత ఉందన్నారు. పక్కనే ఉన్న మహిళా మండలిలో జరిగే ఫంక్షన్ల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుపగా దానిపై మాట్లాడతామన్నారు. వంట గదులను తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. మిని స్టేడియం విషయంలో కూడా జడ్పీచైర్మన్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో వెంటనే సంపును ఏర్పాటు చేయాలన్నారు. బోరును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మిస్తామన్నారు. అతి త్వరలో ఈ పనులు జరుగుతాయన్నారు. శంషాబాద్ ఎంపీడీవో శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈవో రాంరెడ్డి, గ్రామ పంచాయతి ఈవో శ్యాంసుందర్, హెచ్‌ఎం ఉమామహేశ్వరి, జగతి, నార్సింగి మార్కెట్ కమిటి ఛైర్‌పర్సన్ మమత శ్రీనివాస్, చంద్రారెడ్డి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలోని సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శుక్రవారం రాత్రి వర్ష పాతం (సెం.మీలలో)..

మాదాపూర్	12.8
బాలానగర్	12.7
బండ్లగూడ	11.6
బేగంపేట్	11.3
రామచంద్రాపురం	10.8
మైత్రివనం	10.5
అంబర్‌పేట్	10.5
మోండా మార్కెట్	9.8
కుత్బుల్లాపూర్	9.7
కాప్రా	8.9
మల్కాజిగిరి	8.7
ఎల్‌బీనగర్	8.3
నారాయణగూడ	7.9
నాంపల్లి	7.8
ఆసిఫ్‌నగర్	7.6

గణేశా.. చూశావా.. భాగ్యనగరి అవస్థ

వినాయక చవితి వేడుకలకు సన్నద్ధమైన వేళ నగరం తడిసి ముద్దయింది. శుక్ర శనివారాల్లో కురిసిన భారీ వర్షం తాకిడికి పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. ఎడతెరిపి లేని వాన ధాటికి ప్రధాన రహదారుల్లో నీరు నిలిచింది. నడిరోడ్డుపై వరద ఉద్ధృతికి కొన్ని చోట్ల వాహనాలు కొట్టుకుపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని పలు భవనాల సెల్లార్లు నీట మునిగాయి. కాలనీలలోని వీధులు నదులను తలపించాయి. గణేశ మండపాల్లోకి నీరు చేరింది. పలు నివాసాల్లోకి మురుగు ప్రవేశించింది. తాగు, వాడకం నీళ్లను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి వచ్చింది. వరుణుడి ప్రతాపాన్ని తట్టుకోలేని అధికార వ్యవస్థల వైఫల్యం ప్రజలకు ఎప్పటిలాగే అవస్థలు తెచ్చింది.

–ఈనాడు, హైదరాబాద్



బేగంపేట మయూర్‌మార్గ్‌లో ఇంట్లోకి చేరిన మురుగుని బయటకు తోడేస్తున్న స్థానికుడు

వ్యర్థాల కుప్ప...


ఎస్సార్‌నగర్ నాలాలో కొట్టుకొచ్చిన థర్మాకోల్


ఎన్టీఆర్ మార్గ్ నెక్లెస్ రోడ్ ప్రాంతంలో..


దిల్‌సుఖ్‌నగర్‌లో వరద నీటిలో వినాయక మండపం


జలమయమైన మియాపూర్ ప్రధాన రహదారి


పాట్నీనగర్ నాలాలో ఇరుక్కుపోయిన చెత్తను తొలగిస్తున్న కార్మికుడు

భయం భయంగా...



శనివారం రాత్రి ఇలా...


ఎంజే మార్కెట్ వద్ద ఓ దుకాణంలోకి చేరిన నీరు


ఎంజే కూడలిలో మ్యాన్‌హోల్ మూత తొలగిస్తున్న సిబ్బంది

మునిగిన సెల్లార్


మాదాపూర్ బృందావన్ కాలనీలో నీట మునిగిన అను రెసిడెన్సీ సెల్లార్‌లోని వాహనాలు

'సినిమా' కష్టాలు...


మణికొండ చిత్రపురి కాలనీ సమీపంలో నీట ముంపులో భవన కార్మికుల నివాసాలు

జల వీధి.. జన జీవనం..


మల్కాజిగిరి ప్రాంతంలో జలమయమైన వీధి

చెరువు కాదు పార్కే..!


చెరువులా మారిన సంజీవయ్య పార్కు

వర్షం... అనంతరం...


బోయిన్‌పల్లిలో ఇంట్లోకి ప్రవేశించిన నీరు


మూసాపేట బస్సు డిపో వద్ద కుంగిన రోడ్డు


దిల్‌సుఖ్‌నగర్ వీవీనగర్‌లోని ఎస్టీ హాస్టల్ విద్యార్థుల వెతలు


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో..


అల్లంతోట బావి వద్ద తాగునీటిని తెచ్చుకుంటున్న స్థానికుడు


బేగంపేట వద్ద ఇళ్లలోకి చేరిన చెత్తను బయటకు తుడుస్తున్న మహిళ


రాంనగర్ ఈడబ్ల్యూఎస్ కాలనీలో..



కూకట్‌పల్లి జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

మాళ్లలోనూ మద్యం పరవళ్లు!



కొత్త విధానంపై అబ్కారీ శాఖ కసరత్తు

ఇప్పటికే నగరంలో మంచినీళ్ల కంటే మద్యమే సులువుగా అందుబాటులో ఉంటోందనే విమర్శ ఉంది. కొత్తగా షాపింగ్‌మాళ్లలోను బీర్లు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా రూపొందించనున్న మద్యం పాలసీలో దీనికి స్థానం కల్పించనున్నారు. ఆల్కహాల్ తక్కువ శాతం ఉన్న బీర్లు తదితరాలను షాపింగ్‌మాళ్లలో అమ్మేందుకు అనుమతించాలా? వద్దా? అనే అంశంపైనా ఆబ్కారీ శాఖ పలువురి సూచనలు, సలహాలు తీసుకుంటోంది.

ఈనాడు, హైదరాబాద్



ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 10 వేల జనాభాకు ఒక మద్యం దుకాణం ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 30 వేల జనాభాకు ఒక దుకాణం ఉంది. వీటిల్లో మార్పులు చేర్పులు చేయాలా అనే అంశంపైనా అధికారులు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. కొత్తగా అమలులోకి తచ్చే మద్యం పాలసీ రూపకల్పనలో రెండేళ్ల విధానం కూడా తెరమీదకు వచ్చినట్లు సమాచారం. ఇప్పటివరకు ఏడాదికి అనుమతి ఇచ్చి తర్వాతి ఏడాదికి పొడిగిస్తూ వస్తోంది. అయితే, ఈసారి అదేవిధానాన్ని అమలు చేయాలా? రెండేళ్లకు ఇవ్వాలా అనేది క్షేత్రస్థాయి అధికారుల అభిప్రాయాలను ఉన్నతాధికారులు తీసుకుంటున్నారు. కాస్త ఆలస్యమైనా, కొత్తగా రూపొందించే మద్యం పాలసీపై ఎటువంటి విమర్శలు ఉండకూడదనే ఆలోచనతో సమగ్రంగా ఆబ్కారీశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో అభిప్రాయాల సేకరణ

జాతీయ రహదారుల డీనోటిఫై..

జాతీయ రహదారులకు ఇరువైపులా 500 మీటర్ల దూరం లోపు మద్యం దుకాణదారులు ఉండకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. మున్సిపాలిటీ పరిధిలో ఈ నిబంధనకు మినహాయింపు ఇచ్చినట్లు తీర్పులో ఉందని పలువురు దుకాణదారులు ఆబ్కారీ అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. దీనిపై న్యాయనిపుణుల సలహా మేరకు నిర్ణయం తీసుకుంటామని దుకాణదారులకు అధికారులు చెప్పి పంపించినట్లు సమాచారం. మద్యం దుకాణాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలైతే జిల్లాలతోపాటు నగరంలో చాలా దుకాణాలు మూసివేయాల్సిందే. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2,144 మద్యం దుకాణాలు, 800 బారులు, 27 క్లబ్బులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జాతీయ రహదారికి ఇరువైపులా మద్యం దుకాణాలు 500 మీటర్ల లోపు ఉన్నవాటిని అధికారులు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా 1120 మద్యం దుకాణాలు, 395 బారులు, 12 క్లబ్బులు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నట్లు తేల్చారు. వీటన్నింటినీ మూసివేస్తే ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మహానగరంలో పలు రహదారులను జాతీయ రహదారుల జాబితా నుంచి తొలగించడానికి రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొన్నింటికి ఇప్పటికే మినహాయింపు లభించింది. మరికొన్ని జాతీయ రహదారులకు మినహాయింపు రావాల్సిఉంది. ఇప్పటికే లైసెన్స్ ఇచ్చేసిన నేపథ్యంలో వీటి గడువు ముగిసే వరకు వేచిచూసి కొత్తవి ఇచ్చేటపుడు అనుమతి ఇవ్వకూడదనే అంచనాలో ఆబ్కారీ శాఖ ఉంది. కొత్తమద్యం పాలసీపై ఎటువంటి విమర్శలు రాకుండా ఉండేందుకు అన్నిస్థాయిల అధికారుల అభిప్రాయాలను ఉన్నతాధికారులు తీసుకుంటున్నారు. ఈ కసరత్తు అంతా త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటేనే అమలులోకి రానుంది.

దుకాణాల సంఖ్యపైనా మల్లగుల్లాలు

ప్రస్తుతం ఉన్న స్లాబ్‌ల విధానంలో ఏవైనా మార్పులు.. చేర్పులు అవసరమా? కొత్తగా ఎన్ని మద్యం దుకాణాలకు అవకాశాలున్నాయి? ప్రస్తుతం ఉన్న దుకాణాలు సరిపోతాయా? తదితర విషయాలను ఆరా తీస్తున్నారు. ఇటీవల కొన్ని దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలుకాని వాటి విషయంపై ఏం చేయాలనే దానిపైనా మల్లగుల్లాలు పడుతున్నారు. సెప్టెంబరు 31లో మద్యం దుకాణాల లైసెన్స్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో కొత్త పాలసీని తయారు చేస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న దుకాణాలకు జూన్ లోనే గడువు ముగిసిపోయినప్పటికీ మూడు నెలలపాటు పొడిగించిన విషయం తెలిసిందే. ఈ గడువు కూడా వచ్చే నెలాఖరుతో ముగిసిపోనుంది. అక్టోబరు నుంచి మద్యం దుకాణాలకు కొత్తగా లైసెన్స్‌లు ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి పలు మార్పులు చేర్పులతో కొత్తపాలసీని ఆబ్కారీశాఖ రూపొందిస్తోంది.

మున్నూరు కాపుల సంక్షేమానికి రూ.10 కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య, తదితరులు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: మున్నూరు కాపుల సంక్షేమానికి రూ.10 కోట్లు, నగరంలో పదెకరాల స్థలం కేటాయించాలని తెలంగాణ మున్నూరుకాపు అసోసియేషన్ ఐక్య కార్యాచరణ సమితి నేతలు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బర్కత్‌పుర తుల్జాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, ప్రతినిధి బుక్కా వేణు గోపాల్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మున్నూరుకాపుల జనాభా గణన తమ ఐకాస ఆధ్వర్యంలో చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో మున్నూరుకాపు ప్రతినిధులు మంగళారపు లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, గాదె రాజశేఖర్, చింతపంటి భూమయ్య, టి.మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగర కమిటీ ...

తెలంగాణ మున్నూరుకాపు అసోసియేషన్ ఐకాస అడహక్ కమిటీని దేవయ్య ప్రకటించారు. నగర గౌరవ అధ్యక్షుడిగా సుంకరి రంగారావు, అధ్యక్షుడిగా బోగి బాలరాజు, ఉపాధ్యక్షులుగా కొణతం సుదర్శన్, ఎర్రం వెంకన్న, ఎ.సోమరాజు, బుక్కా రమేశ్, ఆకుల సంజయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పుస్తె శ్రీకాంత్, కార్యదర్శులుగా పెరుక ప్రభాకర్, కొండేటి యాదయ్య, ఆకుల శివలను నియమించారు.

అన్యాక్రాంత భూములను పేదలకు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న వెంకట్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని ప్రతి పేద కుటుంబానికి మూడెకరాల చొప్పున పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బి.వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సుందరయ్య కళానిలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల విధానాలనే తెరాస ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పేరిట పేదల భూములను రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా లాక్కొంటుందని మండిపడ్డారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహా, రాష్ట్ర కార్యదర్శి నాగయ్య, నేతలు ఆర్.వెంకట్రాములు, బి.ప్రసాద్, భూతం వీరయ్య, అచ్యుత రామారావు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి బాలల సైన్స్ కాంగ్రెస్ సదస్సులు

గన్‌ఫౌండ్రి: కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మండలి సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్-2017 జిల్లా స్థాయి పోటీలను అక్టోబరు మూడో వారంలో నిర్వహించనున్నట్లు హైదరాబాదు విద్యా జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను సంసిద్ధులను చేసేందుకు గానూ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్-2017పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 29న సికింద్రాబాదు కీస్ బాలికల ఉన్నత పాఠశాల, 30న ఎర్రగడ్డ సెయింట్ థెరీసా బాలికల ఉన్నత పాఠశాల, 31న హిమాయత్‌నగర్ కేశవ స్మారక ఉన్నత పాఠశాల, 31న బహదూర్‌పుర బాయిస్ టౌన్ పాఠశాలలో జరుగుతాయని వివరించారు. 'సుస్థిర అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం'.. దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి అంశాలపై దృష్టి సారిస్తారని చెప్పారు. అక్టోబరు 28, 29 తేదీల్లో హయత్‌నగర్‌లోని షైన్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలు, డిసెంబరు 27వ తేది నుంచి 31 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జాతీయ స్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు.

చేనేత రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

నవీన్ మిత్తల్

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: చేనేత, టెక్స్‌టైల్ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోందని ఐఏఎస్ అధికారి నవీన్ మిత్తల్ పేర్కొన్నారు. నగరంలో సెప్టెంబరు 9, 10 తేదీల్లో 'ఇండియా గ్లామ్ ఫ్యాషన్ వీక్- సెషన్ 2' కార్యక్రమం నిర్వహించనుండగా ఇందుకు సంబంధించిన ముందస్తు కార్యక్రమం శనివారం సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నవీన్ మిత్తల్ మాట్లాడుతూ, టెక్స్‌టైల్ రంగంపై ఆధారపడి ఎంతోమంది ఉన్నారని, వారి అభివృద్ధి, ఉపాధికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ ఫ్యాషన్ హబ్‌గా మారిందని కితాబిచ్చారు. ఫ్యాషన్ వీక్ నిర్వాహకురాలు అరుణాగౌడ్ మాట్లాడుతూ దీంతో వచ్చే ఆదాయంలో అధికభాగం పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూపదర్శినులు ర్యాంప్ వాక్ నిర్వహించారు.



ఆకట్టుకున్న రూపదర్శినులు



మాట్లాడుతున్న నవీన్ మిత్తల్

అంకుర సంస్థలకు ప్రభుత్వం నుంచి సహకారం

ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్



ప్రసంగిస్తున్న ప్రతినిధి, చిత్రంలో జయేష్ జయేష్‌రంజన్

రాయదుర్గం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం అంకుర సంస్థలకు సంపూర్ణ సహకారం అందిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో 'ఆగస్ట్ ఫెస్ట్' పేరిట అంకుర సంస్థల సమావేశం శనివారం నిర్వహించారు. జయేష్‌రంజన్ మాట్లాడుతూ దేశంలో 19వేల అంకుర సంస్థలుంటే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 2500 వరకు ఉన్నాయన్నారు. నవంబరులో హైదరాబాద్‌లో గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ సమిట్ జరగనుందని, వివిధ దేశాల నుంచి పెట్టుబడిదారులు హాజరవుతారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా అక్కడి వ్యాపార వేత్తల బృందంతో కలిసి పాల్గొంటున్నారన్నారు. సంగీత దర్శకుడు రమణగోగుల మాట్లాడుతూ విఫలమైన వారితోపాటు సంపూర్ణ విజయం సాధించినవారి నుంచి యువత సలహాలు, సూచనలు తీసుకుంటే అవరోధాల్లోంచి బయటపడి ముందుకు సాగడమెలానో తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చాగోష్ఠిలు నిర్వహించారు. 17 అంకుర సంస్థలు తమ ఉత్పత్తులు, వ్యాపారం గురించి పెట్టుబడిదారుల ముందు వివరించాయి.

గాడి తప్పిన ఫలితాలు!

నృత్యం, సంగీతంలో డిప్లొమ, సర్టిఫికెట్ కోర్సుల విద్యార్థుల ఎదురుచూపు ● పరీక్షలై మూడు నెలలైనా వెల్లడించని తెలుగు వర్సిటీ

ఈనాడు, హైదరాబాద్

ప్రవేశ పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాలు వెల్లడించి ప్రవేశాలు కల్పించే ప్రతి ప్రక్రియలోనూ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తీవ్ర జాప్యం చేస్తోంది. మూడేళ్లలో పూర్తి కావాల్సిన కోర్సు ఈ వర్సిటీలో నాలుగేళ్లు పడుతోందంటే విషయం అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులు ఒక ఏడాదిని వృథాగా వదులుకోవల్సి వస్తోంది. వర్సిటీ నేరుగా నిర్వహించే కోర్సుల్లోనే కాకుండా.. సంగీతం, నృత్యం వంటి సర్టిఫికెట్, డిప్లొమ కోర్సుల విషయంలోనూ ఇదే తాత్సారం చేస్తోంది. వాస్తవానికి సంగీతం, నృత్యం వంటి కోర్సులకు వర్సిటీ కేవలం పరీక్ష పత్రాల తయారీ, నిర్వహణ మాత్రమే చేస్తుంది. మిగతా పరిపాలన విషయాలన్నీ భాషా సాంస్కృతిక శాఖ చూస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సంగీతం, నృత్యానికి సంబంధించి పలు ప్రాంతాల్లో సుమారు 15 కళాశాలలున్నాయి. హైదరాబాద్ గ్రేటర్ పరిధిలోనే ఎక్కువ కళాశాలలున్నాయి. వీటిల్లో వందల సంఖ్యలో విద్యార్థులు ఏటా డిప్లొమ, సర్టిఫికెట్ కోర్సుల్లో చేరుతున్నారు. డిప్లొమ, సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించి పరీక్షలు మే 15వ తేదీన ప్రారంభమై.. అదే నెల 25వ తేదీన పూర్తయ్యాయి. అయితే ఇప్పటివరకు ఈ కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్షల ఫలితాలు తెలుగు వర్సిటీ వెల్లడించలేదు. దీంతో వేలాది మంది విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ కోర్సుల్లో ఫలితాలు వస్తే తర్వాత ఇతర కోర్సుల్లో చేరేందుకు వెసులుబాటు ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ ఫలితాల విషయంలో వర్సిటీ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని పలు కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



ఎందుకింత జాప్యం..?

వర్సిటీ స్థాయిలో ప్రతి కార్యక్రమానికి ఒక కాలవ్యవధిని యూజీసీ రూపొందించింది. ఎప్పుడు ప్రవేశ పరీక్షలు నిర్వహించాలి, ఎప్పుడు ఫలితాలు వెల్లడించాలి? తదితరాలకు స్పష్టమైన క్యాలెండర్ ఉండాలని నిబంధనలు ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పరీక్షల నిర్వహణ, ఫలితాలు వెల్లడి విషయంలో స్పష్టమైన ఆదేశాలు వర్సిటీలకు యూజీసీ ఇచ్చింది. దీనికి అత్యవసరమైన పరిస్థితులు మినహా మిగతా సందర్భాల్లో తప్పకుండా పరీక్షల ఫలితాలను 45 రోజుల్లోపు ఇవ్వాల్సిందేనని నిబంధన ఉంది. తెలుగు వర్సిటీ ఇలాంటి నిబంధనలను పట్టించుకోవట్లేదని విద్యార్థుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సంగీతం, నృత్యం కోర్సులు చేస్తున్న విద్యార్థుల పరీక్షల ఫలితాల వెల్లడి విషయంలో కేవలం ఇద్దరి ముగ్గురు వ్యక్తుల నిర్లక్ష్యం కారణంగా జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారి ఈ ఊసే పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నిరుత్సాహంలో విద్యార్థులు..

పరీక్షలు రాసిన తర్వాత వాటి ఫలితాలు ఎప్పుడు వస్తాయని విద్యార్థులు ఎంతో ఆశగా ఎదురుచూస్తారు. వార్షిక ఫలితాలు వెలువడితే తర్వాతి ఏడాది పాఠ్యాంశాలపై శ్రద్ధ పెట్టడానికి వీలుంటుందని విద్యార్థులు వివరిస్తున్నారు. ఆయా కోర్సుల్లో తర్వాతి ఏడాదుల్లో తరగతులు ప్రారంభమై రోజులు గడిచిపోతున్నా.. ముందు ఏడాది ఫలితాలు రాకపోవడం నిరుత్సాహానికి గురిచేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. 30 నుంచి 45 రోజుల్లో పరీక్షలకు సంబంధించిన ఫలితాలు వెల్లడించాలని యూజీసీ నిబంధన ఉంది. పరీక్షలు రాసి 45 రోజులు పూర్తయిన రోజు నుంచి విద్యార్థులు నిత్యం వర్సిటీ వెబ్‌సైట్‌ని చూస్తూనే ఉన్నారు. కొందరైతే వర్సిటీ అధికారులకు ఫోన్ చేస్తున్నారు. ఫలితాలు ఎప్పుడు వస్తాయనే స్పష్టత వర్సిటీ నుంచి కొరవడిందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటా.. – ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం



సంగీతం, నృత్యం కోర్సుల పరీక్షలు జరిగి 90 రోజులైనా ఫలితాలు వెల్లడి కాకపోవడానికి సంబంధించి ఎవరి నిర్లక్ష్యం ఉందో చూసి వారిపై చర్యలు తీసుకుంటా. రెండు, మూడు రోజుల్లోనే పరీక్షల ఫలితాలు వెల్లడించేలా ఆదేశాలిస్తాను. ఇకపై వర్సిటీ పరీక్షలు, ఫలితాలు తదితర విషయాల్లో జాప్యం లేకుండా అధికారులందరినీ అప్రమత్తం చేస్తాను.



క్రీడాకారులను అభినందిస్తున్న ఖాజీ నజముద్దీన్, జగన్మోహన్ గౌడ్ తదితరులు

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: క్రీడా పోటీల్లో దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా ఇనుమడింపచేసేలా ప్రతిభ కనపర్చాలని తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజీ నజముద్దీన్, జగన్మోహన్ గౌడ్ క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈనెల 28-30 తేదీల్లో కౌలాలంపూర్‌లో జరగనున్న ఏషియన్ త్రోబాల్ క్లబ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ తరపున హైదరాబాద్ నుంచి 24మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వీరికి అభినందన సభను బంజారాహిల్స్‌లోని గతి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఉచితంగా 'స్పోర్ట్స్ కిట్స్' అందజేశారు. దారి ఖర్చుల నిమిత్తం కొంత నగదునూ ఇచ్చారు. ఖాజీ నజముద్దీన్, జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ, ఈ క్రీడలో మన ప్రాంత విద్యార్థులు చక్కని ప్రతిభ చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ కోశాధికారి వెంకట్, ఉపాధ్యక్షుడు పీవీఎల్ఎన్ మూర్తి, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా కల్పశ్రీ అంతర్జాతీయ నృత్యోత్సవం



నృత్యం చేస్తున్న కళాకారులు

వివేక్‌నగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరం శాస్త్రీయ, సంప్రదాయ కళారూపాల వికాసానికి అనువైనదని, అందుకు కర్ణాటక రాష్ట్రంలోని కల్పశ్రీ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ సంవత్సరం తమ అంతర్జాతీయ నృత్యోత్సవ నిర్వహణకు నగరాన్ని ఎంపిక చేసుకోవడం నిదర్శనమని తమిళనాడు మాజీ గవర్నర్ డా. కె. రోశయ్య అన్నారు. కల్పశ్రీ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్ ట్రస్టు ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించే 2017-కల్పశ్రీ అంతర్జాతీయ నృత్యోత్సవాన్ని ఆయన శనివారం త్యాగరాయగానసభ సదనంలో ప్రారంభించారు. ప్రముఖ నృత్యదర్శకులు, ఉత్సవ నిర్వహణ సంఘం సారథి ఎంసీ సుజేంద్రబాబు స్వాగతోపన్యాసం, నాంది ప్రస్తావన చేశారు. యువకళావాహిని స్థాపక అధ్యక్షుడు, ఉత్సవ సంఘం సలహాదారు వైకే నాగేశ్వర్‌రావు ఆహ్వానం పలికారు. లోహిత, అక్షర వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జాతీయ, అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన పలువురు నర్తకీమణులు శాస్త్రీయ నృత్యాంశాలను ప్రదర్శించారు. కళాపోషకులు సారిపల్లి కొండల్‌రావు అధ్యక్షత వహించగా సతీష్, రత్నాకరశర్మ, డా. పి. మధుసూదన్‌రావు, ఎం. ఆదిత్యప్రసాద్, డా. కేవీ కృష్ణకుమారి, అనుపమామోహన్, సత్యవాణి, నాగరాజప్రసాద్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా విద్యార్థి మృతి



ఆదర్శ్ (పాతచిత్రం)

ఇబ్రహీంపట్నం గ్రామీణ: పాఠశాలలో ఆడుకుంటున్న చిన్నారి అకస్మాత్తుగా అపస్మారకస్థితిలోకి వెళ్లి మృతిచెందిన సంఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. సీఐ గోవింద్‌రెడ్డి, కుటుంబీకుల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్ గ్రామానికి చెందిన గొడాసు ఆదర్శ్ (11) నాదర్‌గుల్‌లోని ఓ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. తర్వాత ఇంటికి వెళ్లేందుకు తరగతి గదిలోని బ్యాగ్ తెచ్చుకునేందుకు పైకి వెళ్లాడు. కొద్దిసేపటి అనంతరం ఇతర విద్యార్థులు వచ్చి చూసేసరికి ఆదర్శ్ బ్యాగ్ మీద పడిపోయి ఉండడాన్ని గమనించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. విద్యార్థిని ఆసుపత్రికి తరలించడంలో పాఠశాల యాజమాన్యం, బాధిత కుటుంబసభ్యులు వేర్వేరు విషయాలు వెల్లడిస్తుండటం గమనార్హం.

విద్యార్థి నేత్రాలు దానం

కుమారుడి ఆకస్మిక మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. విద్యార్థి కళ్లను తండ్రి గొడాసు రవీందర్ ఎల్వీప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు. ఆదర్శ్ అనే పేరును ఆదర్శంగా ఉండేలా చేశామన్నారు.





మహా పర్యూషణ్ పర్వ్‌లో పాల్గొన్న భక్తులు, గురువులు

ఘనంగా మహా పర్యూషణ్ పర్వ్

బన్సీలాల్‌పేట్, న్యూస్‌టుడే: 'మనస్ఫూర్తిగా వేడుకుంటున్నా.. నా వల్ల తెలిసో తెలియకో... పొరపాట్లు జరిగి ఉంటే క్షమించండి..' అంటూ జైనులు తమ అధ్యాత్మిక గురువు ప్రవీణ్‌రిషి ఉపాధ్యాయ ఆధ్వర్యంలో జరిగిన మహా పర్యూషణ్ పర్వ్‌లో వేడుకున్నారు. ఏటా ఆగస్టులో వారం రోజుల పాటు పర్యూషణ్ పర్వ్ నిర్వహిస్తారు. శనివారం రాణిగంజ్‌లో జరిగిన కార్యక్రమంలో వేలాది మంది జైనులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రిభోజనం చేయకుండా, ఆడంబరాలు లేని సాధారణ జీవితాన్ని గడిపారు. నిర్వాహకులు సంపత్‌రాజ్ కొటారి, పరస్మల్ దుంగర్వల్, మనోజ్ కొటారి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎంవీరెడ్డి

కీసర: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వర్షాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ 040-29700826, డీపీఓ కార్యాలయం 040-29700835, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం 040-29700830, విద్యుత్ శాఖ కార్యాలయం 040-23433311, 9491039018 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దసరా కానుకగా బతుకమ్మ చీరలు: దసరా కానుకగా ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న బతుకమ్మ చీరల పంపిణీని సెప్టెంబరు 18, 19 తేదీల్లో చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సూచించారు. శనివారం సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్క మహిళకు చీర అందించాలన్నారు. జిల్లాలో దాదాపు 6 లక్షల తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారని, వీరందరికి రేషన్ దుకాణాల వారీగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

నేరేడ్‌మెట్‌లో 'సికింద్రాబాద్ సెంటర్' ప్రారంభం



ప్రారంభిస్తున్న దౌలత్‌రాయ్ చందాని తదితరులు

డిఫెన్స్‌కాలనీ: నేరేడ్‌మెట్ కూడలిలో ఆధునిక వసతులతో కూడిన మల్టీ బ్రాండ్ షోరూం 'సికింద్రాబాద్ సెంటర్'ను శనివారం ప్రముఖ వ్యాపారవేత్త దౌలత్‌రాయ్ చందాని, కార్పొరేటర్ శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారుల అభిరుచికి తగినట్లు నాణ్యమైన వస్తువులను అందుబాటు ధరల్లో అందించి అందరి అభిమానాన్ని చురగొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దీపక్‌రాయ్ చందాని, అనిల్‌రాయ్ చందాని, ప్రకాష్, రాజ్‌కుమార్, సునీల్, పిట్ల మోహన్, లక్ష్మి, జీకే హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఓనం ఉత్సవాలు నేడు

బషీర్‌బాగ్: కాన్ఫడరేషన్ ఆఫ్ తెలుగు రీజియన్ మలయాళీ అసోసియేషన్ (సీటీఆర్ఎంఏ), తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో నేడు బంగారు ఓనం ఉత్సవాలను నిర్వహించనున్నారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీటీఆర్ఎంఏ అధ్యక్షులు లిబ్బీ బెంజమిన్, ప్రధాన కార్యదర్శి కేఆర్ శశిధరన్ నాయర్ వివరాలు వెల్లడించారు. రవీంద్రభారతి ఆడిటోరియంలో ఉ.10 గంటలకు ఈ ఉత్సవాలు ప్రారంభమౌతాయని చెప్పారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మలయాళీలకు సంబంధించిన గ్రామీణ కార్యక్రమాలు, క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ గవర్నర్ కె. రోశయ్య, కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, నాయిని, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నారని చెప్పారు.



కుత్బుల్లాపూర్‌లోని హెచ్ఎంటీ క్రీడా మైదానం

వాడుకోని ఆడుకోమన్నా..!

- క్రీడా స్థలాలు ఇస్తామన్నా ముందుకు రాని పాఠశాలలు
- జీహెచ్ఎంసీ పిలుపునకు స్పందన అంతంతమాత్రమే
- స్థలాభావంతో ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్

క్రీడామైదానాలను చౌకగా లీజుకు ఇస్తామంటే ముందుకురాని పాఠశాలల వారు ఉంటారా? జీహెచ్ఎంసీ ఇచ్చిన పిలుపునకు పాఠశాలల నుంచి వచ్చిన అరకొర స్పందన చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. నిబంధనల ప్రకారం పాఠశాలకు క్రీడామైదానం కలిగి ఉండాలన్న భావనతో కొందరు పాఠశాలల యజమానులు నామమాత్రంగా మైదానాలను లీజుకు తీసుకోవడానికి ముందుకు వస్తుండగా.. రాళ్లు రప్పలు, పిచ్చి మొక్కలతో ఎగుడు దిగుడుగా ఉన్న ఆయా మైదానాలను లీజుకు తీసుకోవడం వల్ల ఒనగూడే ప్రయోజనమేముంటుందన్న భావనతో మరి కొందరు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది.

ముందుకొచ్చింది 20 శాతం పాఠశాలలే

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు కేవలం 20 శాతం విద్యా సంస్థలు మాత్రమే క్రీడా స్థలాల లీజు కోసం జీహెచ్ఎంసీలో తమ పాఠశాలల పేర్లను నమోదు చేసుకున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల కనీసం 1000 చ.గ. వైశాల్యంతో కూడిన క్రీడామైదానం కలిగి ఉండాలి. లేని పక్షంలో ఆ పాఠశాలకు గుర్తింపునిచ్చే అవకాశం కూడా ఉండదు. కాని జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం ఇందుకు భిన్నంగా క్రీడా మైదానాలు లేకుండానే ప్రైవేటు పాఠశాలలు పుట్టుకొస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో చదివే పిల్లలకు క్రీడల పట్ల మక్కువ ఉన్నా మైదానాలు అందుబాటులో లేక ఆటలకు దూరమవుతూ మానసికోల్లాసాన్ని కోల్పోతున్నారు. ఆలాంటి పాఠశాలలకు జీహెచ్ఎంసీ వారు లీజు పద్ధతిన క్రీడా మైదానాలను ఇవ్వడానికి ముందుకొచ్చింది. గత ఏడాది సర్కిళ్ల వారీగా సర్వే నిర్వహించి ఖాళీగా ఉన్న సుమారు 521 క్రీడామైదానాలను ఎంపికచేసి లీజుకు ఇవ్వడానికి సిద్ధం చేసింది. వాటిని వినియోగించుకొనేందుకు కేవలం 509 పాఠశాలల యజమానులు మాత్రమే ముందుకొచ్చారు. దీంతో గత ఏడాది సుమారు 80 శాతం మైదానాలు ఖాళీగానే ఉండిపోయాయి. ఈసారి కూడా వారి నుంచి ఆశించిన మేరకు స్పందన రాకపోవడంతో క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది.

బల్దియా పరిధిలో జోన్ల వారీగా క్రీడామైదానాలు

జోన్లు	మైదానాలు	విస్తీర్ణం(చ.మీ.లలో)
మధ్య	222	3,92,231
తూర్పు	69	91,971
పశ్చిమ	61	1,92,728
ఉత్తర	66	2,95,060
దక్షిణ	103	2,81,614

ఇలా నమోదు చేసుకోవాలి

క్రీడామైదానాలు కావాల్సిన పాఠశాలలు ముందుగా రూ.500 రుసుము చెల్లించి తమ పాఠశాల పేరును జీహెచ్ఎంసీలో నమోదు చేసుకోవాలి. అనంతరం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ పాఠశాలకు దగ్గరలో స్థలం కేటాయిస్తారు. ఆ పాఠశాల తమకు కేటాయించిన సుమారు 500 చ.మీ. స్థలానికి సాలీనా(75 గంటల పాటు వినియోగించుకోవడానికి) రూ.10,000 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల విషయంలో మాత్రం జీహెచ్ఎంసీ చిన్నచూపు చూస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారానికి ఐదు రోజులు ప్రైవేటు పాఠశాలకు మైదానాలను కేటాయిస్తున్న అధికారులు ప్రభుత్వ పాఠశాలలకు మాత్రం ఉచితంగా వారానికి ఒక రోజు మాత్రమే కేటాయించడంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వయంగా వెళ్లి విన్నవించినా..

జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అధికారులే స్వయంగా పాఠశాలలకు వెళ్లి స్థలాలను లీజుకు తీసుకొమ్మని అభ్యర్థిస్తున్నా స్పందన లభించడం లేదు. పాఠశాలలు ప్రారంభమై రెండున్నర నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు కేవలం 189 పాఠశాలల యాజమాన్యాలు మాత్రమే క్రీడా మైదానాలను లీజుకు తీసుకోవడానికి ముందుకొచ్చినట్లు అధికార వర్గాల సమాచారం. జీహెచ్ఎంసీ లీజుకు ఇవ్వడానికి సిద్ధం చేసిన కొన్ని మైదానాలు రాళ్లు, రప్పలు, పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమీపంలో తాగునీటి సౌకర్యమూ లేకపోవడంతో లీజుకు తీసుకోవడానికి పాఠశాలలు ముందుకు రావడంలేదు. సమతలంగా ఉన్న మైదానాలను కొందరు లీజుకు తీసుకుంటున్నా వాటిని వినియోగించుకుంటున్న దాఖలాలు ఉండటంలేదు. వ్యాయామోపాధ్యాయులు లేక కొందరు.. మార్కులు, గ్రేడ్‌లే లక్ష్యంగా విద్యాబోధన చేస్తూ మరికొందరు... విద్యార్థులకు మైదానాల ముఖం కూడా చూపకపోవడంతో విద్యార్థులు మానసికోల్లాసానికి నోచుకోవడంలేదు.

జీహెచ్ఎంసీ పరిధిలో పాఠశాలలు, మైదానాల పరిస్థితి

ప్రభుత్వ పాఠశాలలు	812
ప్రైవేటు పాఠశాలలు	5850
చదువుతున్న విద్యార్థుల సంఖ్య	2.16 లక్షలు
క్రీడా స్థలాలు కలిగిన పాఠశాలలు	30 శాతం
అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలు	521
లీజుకు సిద్ధంగా ఉన్న క్రీడా స్థలం	12,53,604 చ.మీ.
క్రీడా స్థలాల కోసం నమోదు చేసిన పాఠశాలలు	20 శాతం



కూకట్‌పల్లి ప్రకాష్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను నల్లచెరువు రోడ్డు పక్కన ఆడిస్తున్న ప్రధానోపాధ్యాయుడు





పైపై పూత... తొలగని రోత

నగరంలో కుండపోత వర్షం కురుస్తోంది. ఈ తరుణంలో మరమ్మతులు చేపడితే ఒక్క క్షణం కూడా నిలబడే అవకాశం ఉండదు. అయినా 65వ నంబరు జాతీయ రహదారిపై చింతలకుంట వద్ద శనివారం రోడ్డుపై గుంతలు పూడ్చే పనులు చేపట్టారు. ఇది చూసి జనాలు ఆశ్చర్యపోయారు.



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

రాజకీయ ప్రయోజనాల కోసమే మున్నూరు కాపు ఐకాస ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ

కాచిగూడ, న్యూస్‌టుడే: కొందరు వ్యక్తులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే మున్నూరు కాపు ఐకాసను ఏర్పాటు చేసి మున్నూరు కాపుల ఐక్యతను దెబ్బతీస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ విమర్శించింది. సభ్యత్వ నమోదు పేరుతో ఒక్కొక్కరి నుంచి లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించింది. శనివారం కాచిగూడలోని మున్నూరు కాపు సంఘంలోని కార్యాలయంలో మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాశెట్టి ఆనంద్‌కుమార్, కోశాధికారి బండి శ్రీనివాస్, కార్యదర్శులు మాణిక్‌ప్రభు, ఆదినగేశ్, కొండూరు వినోద్‌కుమార్, హన్మంత్‌రావు, ప్యాట శ్రీనివాస్‌రావు, శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. 1932లో కాచిగూడ కేంద్రంగా మున్నూరు కాపు మహాసభను అప్పటి మున్నూరు కాపు పెద్దలు ఏర్పాటు చేశారని తెలిపారు. మహాసభ ద్వారా పేద మున్నూరు కాపుల వివాహానికి పుస్తెమట్టెలు, గ్రామాల్లో కాపు సంఘాల భవనాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మహాసభకు అనుబంధంగా మున్నూరు సంఘాలు కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్నాయన్నారు. కొత్తగా కొందరు వ్యక్తులు మున్నూరు కాపు సంఘాల ఏర్పాటు పేరుతో డబ్బులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

నేత్రదానం చేసిన సంయుక్త కలెక్టర్ ప్రశాంతి

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా హైదరాబాద్ జాయింట్ కలెక్టర్ ప్రశాంతి.. నేత్రదానం చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను జాతీయ అంధత్వ నివారణ పథకం హైదాబాద్ జిల్లా అధికారి, సరోజిని దేవి కంటి ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.రవీందర్‌గౌడ్‌కు ఆమె అందజేశారు. అంతకు ముందు నేత్రదాన పక్షోత్సవాలను సంబంధించిన గోడ పత్రికలను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ పక్షోత్సవాలు సెప్టెంబరు 8 వరకు కొనసాగుతాయని డా.రవీందర్‌గౌడ్ చెప్పారు.

నేడు బీఎస్ఎన్ఎల్ మెగా మేళా

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే : బీఎస్ఎన్ఎల్ మెగా మేళాలో భాగంగా ఆదివారం వినియోగదారులకు అన్ని సర్వీస్ సెంటర్లలో, ఫ్రాంఛైజీస్, రిటైల్ ఔట్‌లెట్‌లలో, రోడ్ షోల వద్ద 3జీ స్మార్ట్ సిమ్‌లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం ఎల్.అనంతరామ్ తెలిపారు. వినియోగదారులకు కొత్త కనెక్షన్‌తో పాటు 350 ఎంబీ డాటాను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ల్యాండ్‌లైన్, బ్రాండ్‌బ్యాండ్, ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్లను సైతం మేళాలో పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 1503 లేదా 18001801503 లలో సంప్రదించవచ్చన్నారు.

బోధకుల భర్తీ ఊసే లేదు!

- భాషా పండితులదీ అదే తీరు
- సమస్యల చెంతనే చదువులు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దిగజారుతున్న విద్యా ప్రమాణాలు

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, చంచల్‌గూడ

డిగ్రీ పూర్తి చేస్తే ఏదో ఒక ఉద్యోగం వస్తుందని చాలామంది విద్యార్థులు ఎన్నో ఆశలు పెట్టుకొని చదువుకొంటున్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఫీజుల మోత భరించలేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బాటపడుతున్నారు. దూరప్రాంతాల నుంచి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆయా కళాశాలలకు వందలాది విద్యార్థులు వస్తున్నారు. తీరా ఆయా కళాశాలల్లో పరిస్థితి చూస్తే అక్షరం ముక్క నేర్పేవారే ఉండట్లేదు. ఇక్కడ ఉన్న చాలా కళాశాలల్లో ఇదే పరిస్థితి. కొన్నేళ్లుగా భాషా పండితులు లేకుండానే కొన్ని కళాశాలలు కొనసాగుతున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ కళాశాలలో సీట్ల కోసం తొలి ప్రాధాన్యం ఇచ్చే విద్యార్థులు.. ప్రస్తుతం ప్రైవేటు బాట పడుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ప్రైవేటు వాటి నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు మేట వేశాయి. కనీసం బెంచీలు, కుర్చీలు, ఫ్యాన్‌లు తదితర అత్యవసర వస్తువులు పలు కళాశాలల్లో లేవు. ఒప్పంద ఉద్యోగులను భర్తీ చేసుకొని తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చి చేతులు దులుపుకొంది. అయితే, అది క్షేత్రస్థాయిలో ఫలితాలివ్వలేదు. ఎందుకంటే ఒక పని గంటకు బోధకుడికి ప్రభుత్వం ఇచ్చే వేతనం రూ.వందగా ఉంది. అదీ చేసిన పనిగంటలకు మాత్రమే వేతనం చెల్లిస్తారు. సెలవు దినాలకు సంబంధించి ఎటువంటి వేతనం ఉండదు. ఇలా ఎంతకాలం పనిచేసినా పర్మినెంటు అవుతుందనే భరోసా ఉండదు. ఎప్పుడు తీసేసినా ప్రశ్నించే హక్కు ఉండదని ఒప్పంద పత్రంలో స్పష్టంగా ఉంటోందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఇవన్నీ నచ్చి బోధకుడిగా చేరి.. రోజుకి రెండు తరగతులు పాఠాలు చెప్పారనుకుంటే.. అతనికి వచ్చేది రూ.200 హైదరాబాద్ మహా నగరంలో ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లి రావాలన్నా కనీస ఛార్జీలే రూ.వందకు మించిపోతున్నాయి. శివారు ప్రాంతాల్లో నుంచి రావాలంటే వచ్చిన ఆదాయం అంతా ఛార్జీలకే సరిపోతుంది. ఇలాంటి కారణాలతో సర్కారు కళాశాలల్లో బోధనకు నైపుణ్యాలున్న వారు ఎవరూ మొగ్గు చూపట్లేదనే విమర్శ ఉంది.



చంచల్‌గూడ డిగ్రీ కళాశాలలో నేలపైనే కూర్చున్న విద్యార్థులు

కొత్త కళాశాలల్లో మరింత దారుణం..

కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను మంజూరు చేయట్లేదు. నాయకుల పట్టుపట్టి రాష్ట్రంలో అయిదు కళాశాలలను మంజూరు చేయించుకున్నారు. అయితే వీటికి కనీస సౌకర్యాలు, బోధకులు లేకుండానే ఈ ఏడాది తరగతులు ప్రారంభించేశారు. ఉదాహరణకు నగరంలోని చంచల్‌గూడ డిగ్రీ కళాశాలలో తరగతులను 2017 జులైలో ప్రారంభించారు. ఆన్‌లైన్ పద్ధతిలో ఇప్పటికే 160 మంది విద్యార్థులు చేరారు. ఇప్పటికీ ఇంకా విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. కానీ, ఏం ప్రయోజనం.. వారి భవిత ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది. కళాశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఆర్ట్స్ గ్రూపులకే కాదు, సైన్సు గ్రూపులకు అధ్యాపకులు లేరు. అమీర్‌పేటలో ఉన్న సైన్స్ కళాశాల నుంచి ముగ్గురు అధ్యాపకులను ఇక్కడికి డిప్యుటేషన్‌పై పంపించారు. కామర్స్, ఎకనామిక్స్, పొలిటికల్ పాఠ్యాంశాలు వీరు బోధించనున్నారు. అయితే, ఆంగ్లం, తెలుగు, హిందీ తదితర భాషా బోధకులు, సైన్సు గ్రూపుల్లో కూడా ఒక్కరూ లేరు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

సమస్యలతోనే స్వాగతం..

గ్రేటర్ పరిధిలోని చాలా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 2017-18 విద్యా సంవత్సరానికి సమస్యలతోనే స్వాగతం పలుకుతోంది. నగరంలోని చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నల్గొండ, వనపర్తి, పాలమూరు, వికారాబాద్, సూర్యపేట, కడ్తాల్, ఆమన్గల్, భోనగిరి, తాండూరు తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. ఈ కళాశాలను ప్రారంభించే సమయంలో అన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు చేసిన హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. సర్కారు కళాశాలల్లో గత మూడేళ్లుగా బోధకుల భర్తీ జరగలేదు. దీంతో ప్రతి కళాశాలలో దాదాపు సగం పోస్టులు ఖాళీగానే ఉన్నట్లు సమాచారం. ఇటీవల జూనియర్ కళాశాలల్లో బోధకుల్లో సుమారు 150 మందికి ప్రమోషన్ ఇచ్చి డిగ్రీ కళాశాలలకు పంపించారు. అయితే, వారిలో చాలామంది మళ్లీ వెనక్కి వెళ్లిపోయారు. కొందరైతే ఆదిలోనే డిగ్రీ కళాశాలల అవకాశాన్ని వదులుకున్నారు.



విద్యార్థులు కూర్చునేందుకు వేసిన చద్దర్లు

డిగ్రీలోనూ నేల చదువులే..

అట్టహాసంగా డిగ్రీ కశాశాలలను ప్రారంభించిన అధికారులు.. వాటి సమస్యల గురించి పట్టించుకోవట్లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కళాశాలల్లో నేలపైనే కూర్చుని చదువుకోవాల్సి వస్తుంది. చంచల్‌గూడ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు తమ ఇళ్ల నుంచి చద్దర్లను తెచ్చుకొని వాటిపై కూర్చుంటున్నారు. కొందరైతే నేలపైనే చతికలబడుతున్నారు. బల్లలు, కుర్చీలు వంటి కనీస వసతులు కల్పించకపోవడం దారుణమని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోధకులు లేకపోవడంతో విద్యాప్రమాణాలు దిగజారుతున్నాయని విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు.



రైల్వేస్టేషన్ తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న పాప

అమ్మా అని పిలిచినా.. పలకవేమి..?

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఓ గుర్తుతెలియని మహిళ పాదచారుల వంతెనపై మృతిచెందింది. ఆమె వద్ద ఉన్న ఏడాది చిన్నారి దిక్కుతోచని స్థితిలో రోదిస్తూ.. తల్లి మృతదేహాన్ని కదిలిస్తూ ఉంది. గుర్తించిన ప్రయాణికుల సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని శవాగారానికి తరలించారు. చిన్నారికి అమీర్‌పేట శిశు విహార్‌లో ఆశ్రయం కల్పించారు. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ యువతి(35) చనిపోయి పడి ఉంది. చిన్నారి ఆకలితో అలమటించింది. చిరునామా ఆధారాలేవీ కనిపించలేదు. అనారోగ్యంతో మృతిచెందినట్టుగా భావిస్తున్నారు.



సదస్సులో పాల్గొన్న వరుణ్‌శ్రీరామ్, సంగీతారెడ్డి, పింకీరెడ్డి, కామినీ సరాఫ్ తదితరులు

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు 'స్వయం'

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లోని ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ సంస్థలు ప్రారంభించాలనుకొనే మహిళలకు ఉపాయకారిగా నిలిచే సంస్థగా ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'స్వయం' పేరుతో రూపొందించిన కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. న్యాయ వ్యవహారాల నిపుణులు వరుణ్ శ్రీరామ్, అపోలో ఆసుపత్రుల ప్రతినిధి సంగీతారెడ్డి, ఫిక్కీ ప్రతినిధులు పింకీరెడ్డి, ఫిక్కీ హైదరాబాద్ చాప్టర్ కామినీ సరాఫ్ తదితరులు ఈ కేంద్రాన్ని అధికారికంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే స్వయం ఆధ్వర్యంలో 22 మంది అత్యుత్తమ పారిశ్రామికవేత్తలుగా మారారు. వంద మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వెళ్తున్నట్లు వివరించారు. కేవలం ఫిక్కీ సభ్యులనే కాకుండా అవసరమైన మహిళలందరికీ సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వరుణ్ శ్రీరామ్ మాట్లాడుతూ అంకుర సంస్థలు స్థాపించడంలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కారం వివరించారు. కార్యక్రమంలో భాగంగా స్వయం కేంద్రానికి చెందిన పుస్తకాలను ఆవిష్కరించారు.

బీసీలు బహుజన పాలకులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: బీసీలు బానిసలు కాదని బహుజన పాలకులని ప్రొ.కంచ ఐలయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య కళానిలయంలో బిందేశ్వరీ ప్రసాద్ మండల్ 99వ జయంతిని పురస్కరించుకుని డా.కదిరె కృష్ణ రాసిన 30 వ్యాసాలతో కూడిన బహుజన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీపీ మండల్ జయంతి రోజున ఈ పుస్తకాన్ని విడుదల చేయడం అభినందనీయమన్నారు. దేశ జనాభాలో సగం ఉన్న బీసీలు అన్ని రంగాల్లో తీవ్ర వెనకబాటుకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు రాజ్యాధికారం సాధించుకోవాలని సూచించారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు మాట్లాడుతూ.. 70 ఏళ్లుగా పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ఆరోపించారు. బీసీలంతా ఐక్యమై తమ హక్కులను సాధించుకోవాలన్నారు. మోదుగుపూలు సంపాదకుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ప్రొ.ఎస్.సింహాద్రి, డా.ప్రజ్ఞ, డా.నాగార్జున, డా.బాలబోయిన సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

13మంది మందుబాబుల చోదక పత్రాలు రద్దు

ఏడుగురికి 20 రోజుల జైలు

ఈనాడు,హైదరాబాద్ : మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మంది మందుబాబుల చోదక అనుమతి పత్రాలను ఏడాది పాటు తాత్కాలికంగా రద్దు చేస్తూ ఎర్రమంజిల్ ప్రత్యేక కోర్టుల న్యాయమూర్తులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 229 మందిపై కేసులు నమోదు చేసి వీరందరినీ కోర్టులో హాజరు పరిచారు. పోలీస్ నివేదికను పరిశీలించిన అనంతరం న్యాయమూర్తులు అందరికి జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వారి లోని ఏడుగురికి 20 రోజుల పాటు మిగిలిన 222 మందికి రెండు రోజుల నుంచి 10 రోజుల వరకూ శిక్ష విధించారు. 13 మంది చోదక అనుమతి పత్రాలను ఏడాది పాటు రద్దు చేశారు.

క్యాబ్ డ్రైవర్‌ను బెదిరించి.. పర్సు లాక్కొని..

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: క్యాబ్ డ్రైవరును బెదిరించి, అతనివద్ద నుంచి బలవంతంగా రూ.2 వేలు కలిగి ఉన్న పర్సును లాక్కుని ఉడాయించిన నలుగురు నిందితులను బోయిన్‌పల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. బేగంపేట ఏసీపీ రంగారావు తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన జె.సురేశ్(21) ప్రస్తుతం నల్లకుంట తిలక్‌నగర్‌లో నివాసముంటూ మాదాపూర్‌లోని ఊబర్ సంస్థలో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సురేశ్‌కు ఈనెల 24న అర్ధరాత్రి 2:30గంటలకు నాంపల్లి బజార్‌ఘాట్ నుంచి మేడ్చల్‌కు వెళ్లాలంటూ బుకింగ్ వచ్చింది. బజార్‌ఘాట్ నుంచి నలుగురిని కారులో ఎక్కించుకొని తాడుబంద్ క్రాస్ రోడ్డు సమీపంలోకి చేరుకోగానే ఆ యువకులు బలవంతంగా బెదిరించి.. సురేశ్ జేబులోని రూ.2 వేల పర్సు లాక్కొని పరారయ్యారు. తాడుబంద్ ముస్లిం శ్మశానవాటిక వద్ద కారును ఆపించి ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి.. నాంపల్లి, ఆఘాపురాకు చెందిన ఎండి ఫయాజ్‌అహ్మద్(21), హరిప్రసాద్ అలియాస్ బబ్లూ(21), బిర్జు నర్సింగ్ అలియాస్ బల్లు(21), గోలూరు మోహన్‌కుమార్ అలియాస్ విక్కీ(20)లను అదుపులోకి తీసుకుని విచారించడంతో వారు నేరాన్ని అంగీకరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్, డీఐ సుధీర్‌కుమార్, డీఎస్సై ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న బేగంపేట ఏసీపీ రంగారావు

ఆసరా ఆలస్యం

● నెలాఖరు వచ్చినా అందని పింఛన్లు

● తపాలశాఖ సమ్మె, బ్యాంకులకు సెలవులతో పంపిణీపై ప్రభావం

న్యూస్‌టుడే, మొయినాబాద్

నిన్నామొన్నటి వరకు తపాలశాఖ సమ్మె.. బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో ఆసరా పథకం పింఛన్ల పంపిణీపై తీవ్ర ప్రభావం పడింది. వారం రోజుల క్రితం బ్యాంకు అధికారులు ఒక రోజు సమ్మెకు దిగడంతో పింఛన్లపైనే బతుకుబండి లాగిస్తున్న పండుటాకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వాటి పంపిణీలో తలెత్తుతున్న ఇబ్బందులకు పరిష్కారమార్గాలు చూపాల్సిన అధికారయంత్రాంగం.. తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఆగస్టు నెల ముగింపు దశకు చేరుకున్నా.. డబ్బులు ఇస్తారో..? ఇవ్వరో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ నెల 16వ తేదీ నుంచి తపాలా సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగారు. రెండు రోజుల కిందట సమ్మె విరమించారు. దీని తర్వాత బ్యాంకు అధికారులు ఒక రోజు సమ్మెకు దిగారు. అనంతరం వినాయక చవితి, నాలుగో శనివారం వరుసగా రావడంతో సెలవులు వచ్చాయి. శివారులోని రంగారెడ్డి జిల్లాలో వృద్ధాప్యం, వితంతు, వికలాంగులు, చేనేత, గీత, బీడీ, ఒంటరి మహిళల పింఛన్లన్నీ కలిపి 1.70లక్షల మంది లబ్ధిదారులు ఉండగా.. వీరందరికీ ప్రతినెలా రూ.19.55కోట్ల మేర పంపిణీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం శివారు ప్రాంతంలో తపాల, బ్యాంకుల ద్వారా పింఛన్‌ల పంపిణీ జరుగుతున్నా.. తీవ్ర ఆలస్యం జరుగుతోంది. తపాలశాఖ ద్వారా శివారులో 1,22,898మంది లబ్ధిదారులకు రూ.14.39కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేపట్టాల్సి ఉండగా.. సిబ్బంది సమ్మెకు దిగటంతో కేవలం 5,157మందికి రూ.60లక్షలు మాత్రమే ఇవ్వగలిగారు. సమ్మె ముగిసిన అనంతరం అందించాల్సి ఉన్నా ఆలస్యం జరుగుతోంది. గత రెండు కొన్ని రోజులుగా వరుస సెలవులు, సమ్మె పేరిట బ్యాంకులు సరిగా తెరుచుకోవడం లేదు. ప్రస్తుతం జిల్లాలో బ్యాంకుల ద్వారా 47,226 మందికి రూ.5.16కోట్ల మేరకు కేవలం 18,831మందికి రూ.2.05కోట్లు పంపిణీ చేశారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్న వృద్ధులు

సంకేతాల సమస్య..

హైదరాబాద్ మహానగరానికి అంతర్భాగంగా మారిన శివారు రంగారెడ్డి జిల్లాలో పింఛన్‌ల పంపిణీలో అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఈ-పాస్ యంత్రాల ద్వారా పంపిణీ చేపట్టింది. ఈ యంత్రాలకు సంకేతాలు(సిగ్నల్స్) అందితేనే పింఛన్ పంపిణీ జరుగుతుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న యంత్రాలకు సక్రమంగా సంకేతాలు అందక పంపిణీపై తీవ్ర ప్రభావం పడుతోంది. దాదాపు రెండేళ్లుగా జిల్లాలో ఈ-పాస్ విధానంతోనే ఆసరా పింఛన్‌ల పంపిణీ జరుగుతున్నప్పటికీ.. సమస్యలను మాత్రం అధిగమించడం లేదు. ప్రతినెలా పింఛన్‌ల కోసం లబ్ధిదారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ప్రతినెలా ఒకటో తేదీ నుంచి పదో తేదీ లోపు అందించాల్సి ఉండగా.. ఇక్కడ మాత్రం నెలాఖరు వరకు కొనసాగుతోంది. వికలాంగ లబ్ధిరులకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తుండగా.. వృద్ధులు, ఇతరత్రా లబ్ధిదారులకు రూ.వేయి ఇస్తున్నారు. వీటినే ఆసరాగా చేసుకొని చాలా మంది లబ్ధిదారులు బతుకుబండిని లాగిస్తున్నారు.



యంత్రంలో సంకేతాల కోసం అధికారుల పాట్లు..

ప్రభుత్వానికి నివేదిస్తాం..:

– ఉమారాణి, ఏపీడీ

వరుస సెలవులు రావడంతో ఈ నెల పంపిణీ ఆలస్యమైంది. అదే సమయంలో యంత్రాలకు సంకేతాలు అందకపోతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాల కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం.

రంగారెడ్డి జిల్లా పరిధిలో ఆసరా పింఛన్లు లబ్ధిదారులు ఇలా..

కేటగిరీ	లబ్ధిదారుల సంఖ్య
వృద్ధాప్యం	61,518
వితంతువులు	73,883
వికలాంగులు	26,722
చేనేత	711
గీత	1,905
బీడీ	17
ఒంటరి మహిళలు	5,368

ఓబీసీలపై మోదీ ప్రత్యేక దృష్టి

కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ఓబీసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీల సంక్షేమానికి ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. ఈ మేరకు ఓబీసీలను జాతీయ స్థాయిలో వర్గీకరించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించడం, ఓబీసీ కులాలకు సమ న్యాయం కల్పించి అట్టడుగు వర్గాల వారికి కూడా రిజర్వేషన్ల ప్రతిఫలాలు దక్కేందుకు మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. క్రిమిలేయర్ వల్ల బీసీలకు నష్టం జరగకుండా వార్షిక ఆదాయ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పెంచడం జరిగిందని, వర్గీకరణకు ఇచ్చిన 12 వారాల గడువు సరిపోకపోతే మరి కొంత గడువు పెంచేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించే బిల్లును ఆమోదింపచేస్తామని, ఇప్పటికైనా బీసీల విషయంలో ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. భాజపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రధాని కావడం, బీసీల అభివృద్ధి గురించి చర్యలు తీసుకోవడం మోదీకే చెల్లిందని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల విషయంలో కేంద్ర నిర్ణయాన్ని అభినందిస్తున్నామని, ఇదే సమయంలో జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని, కమిషన్‌కు ఇచ్చిన గడువును 12 వారాల నుంచి 12 నెలలకు పెంచాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా ఎత్తి వేయాలని, చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు శ్యామ్, విక్రమ్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, నాగేశ్, లింగం, శ్రీనివాస్‌గౌడ్, ఆచారి, లక్ష్మీనారాయణ, గంగాధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు ఉపసంహరించాలి

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన న్యాయవాదుల చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జి.విద్యాసాగర్ డిమాండు చేశారు. శనివారం సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... లా కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం అడ్వకేట్స్ చట్టం 1961కి సవరణలను ప్రతిపాదిస్తూ న్యాయవాదుల చట్ట సవరణ బిల్లు-2017ను పార్లమెంటులో ప్రవేశపెట్టారన్నారు. ఈ బిల్లు న్యాయవాదుల హక్కులను కాలరాసే విధంగా ఉందన్నారు. బిల్లును ఉపసంహరించే వరకు న్యాయ పోరాటం చేస్తామన్నారు. సమావేశంలోఏఐలు హైకోర్టు కన్వీనర్ ఎన్.మాధవరావు, నేతలు డి.శ్రీధర్, ఆర్.నారాయణరెడ్డి, ప్రవీణ్, డి.శ్రీనివాస్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధి కోసమే ప్రతిపక్షాలపై సీఎం విమర్శ : చాడ

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ప్రతిపక్షాలు చేసే నిర్మాణాత్మక విమర్శలనూ ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షాలను తిట్టడం ద్వారా లబ్ధి పొందాలన్న ఆలోచనలోనే ముఖ్యమంత్రి ఉన్నారని పేర్కొన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ధర్నాచౌక్ పునరుద్ధరణకు, రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు జాతీయ స్థాయిలో చేపట్టిన ధర్నా, దిల్లీ పర్యటన విజయవంతమైందని చెప్పారు. జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు జాతీయ స్థాయి నాయకులూ హాజరై మద్దతు తెలిపినట్లు చెప్పారు. ధర్నాచౌక్‌పై తెరాస మినహా అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రాజెక్టులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయన్న ముఖ్యమంత్రి ఆరోపణల్లో వాస్తవం లేదని, తెరాస ఆవిర్భావానికి ముందు నుంచే తెలంగాణ ప్రాజెక్టులకు సీపీఐ ఉద్యమాలను చేపట్టిందని గుర్తుచేశారు. ఇంటింటికీ మంచినీరు ఇచ్చే ఓట్లు అడుగుతామన్న ముఖ్యమంత్రి మాటలను స్వాగతిస్తామని, అయితే ఇందుకు ఇష్టానుసారంగా అప్పులు తేవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు.

లండన్ సదస్సుకు ఓయూ అధ్యాపకుడు



డా.అశోక్‌కుమార్

ఓయూ, న్యూస్‌టుడే: భూగోళశాస్త్రం విభాగంలో లండన్‌లో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గిరిజన అధ్యాపకుడు డా.అశోక్ కుమార్ ఎంపికయ్యారు. లండన్‌లో ఈ నెల 29 నుంచి నాలుగు రోజుల పాటు సదస్సు జరుగుతుంది. రాయల్ జాగ్రఫికల్ సొసైటి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిటిష్ జాగ్రఫర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 'క్రియాత్మక వర్గీకరణ ఆధారంగా తెలంగాణ నగరాల అభివృద్ధి' అంశంపై ఆయన ప్రసంగించనున్నారు. భూగోళశాస్త్రం విభాగంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే మొదటి అధ్యాపకుడు ఆయన.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

'మున్' సమావేశాల్లో విద్యార్థుల సందడి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్(విద్యాశ్రమం)లో మోడల్ యునైటెడ్ నేషన్స్(నమూనా ఐక్యరాజ్యసమితి-మున్) సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. దేశ వ్యాప్తంగా 350 మంది సీబీఎస్ఈ పాఠశాలల విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా విచ్చేసి ఆయా దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలను సూచించారు. విద్యాశ్రమం పదో తరగతి విద్యార్థి విశాల్ చౌదరి ఈ మున్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. దాదాపు అన్ని తరగతి గదుల్లో ఆరు కౌన్సిళ్ల సమావేశాలు నిర్వహించారు. దేశీయ ఆర్థిక స్థితిగతులు, సంస్కృతి, సంప్రదాయాలు, వాటి పరిరక్షణ, మానవహక్కులు, అక్కడ జరుగుతున్న అభివృద్ధి, దేశానికి అడ్డంకిగా ఉన్న సమస్యను విద్యార్థులు ఎత్తి చూపడమే కాకుండా ఆయా దేశాల పరిస్థితులను అంచనా వేసేందుకు ఉపయోగపడుతాయని వైస్ ప్రిన్సిపల్ శశికళ అన్నారు.

వ్యాపారి ఇంట్లో దొంగతనం

॥ తులాల నగలు, రూ.1.44 లక్షలు మాయం



తెరిచి ఉన్న బీరువా తలుపు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: పండగ వేళ దొంగలు హల్‌చల్ సృష్టించారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు ఎత్తికెళ్లిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బి.ప్రకాష్ వివరాల ప్రకారం.. యంనంపేట గ్రామ పరిధిలోని సాయి తేజ కాలనీలో నివాసం ఉంటున్న స్థిరాస్తి వ్యాపారి పి.నాగరాజు భార్య వినాయక చవితి సందర్భంగా శుక్రవారం అత్తాపూర్‌లోని పుట్టింటికి వెళ్లింది. తర్వాత నాగరాజు ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో వచ్చి చూసేవరకు ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపకి వెళ్లి చూసే సరికి బీరువాలో ఉన్న సుమారు 11 తులాలు బంగారు నగలు, రూ.లక్షా 44 వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. చోరీ జరిగిన ఇంటిని క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ముని, సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు.